ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
శనివారం 13 ఏప్రిల్ 2024

తిరుపతి నుంచి వైసీపీని తరిమికొట్టాలి

జనసేన నాయకులకు పవన్ కల్యాణ్ పిలుపు

తిరుపతి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ధార్మిక క్షేత్రమైన తిరుపతిని కాపాడుకోవాలంటే, వైసీపీని ఓడించడమే మనందరి లక్ష్యం కావాలని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు.టీడీపీ, జనసేన పార్టీలు బూత్ స్థాయి నుంచి ఒకే మాటగా, వ్యూహాత్మకంగా ఎలక్షనీరింగ్ చేయాలన్నారు. వైసీపీ ఓటమితోనే తిరుపతి ప్రజలు ఊపిరి తీసుకోగలరని తెలిపారు. శుక్రవారం రాత్రి ఇరు పార్టీల నాయకులతో వేర్వేరుగా సమావేశమైన ఆయన ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై దిశానిర్దేశం చేశారు.జనసేన నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన కూటమి అవసరాన్ని వివరించారు.' 2009లో ప్రజారాజ్యం తరఫున చిరంజీవి పోటీ చేసిన సమయంలో కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన వ్యక్తి చేసిన దౌర్జన్యాన్ని ఎవరూ మరచిపోలేదు. అదే వ్యక్తి ఈ అయిదేళ్లుగా తిరుపతిలో, తిరుమల కొండపై ఏ స్థాయిలో తన నైజాన్ని చూపిస్తున్నాడో..ఈ నియోజకవర్గ ప్రజలు ఎంత క్షోభ అనుభవిస్తున్నారో కూడా చూస్తున్నాం. ఇప్పుడు ఆయన వారసుడు వచ్చాడు. వైసీపీ అప్రజాస్వామిక చర్యలను, గూండాగిరీని అడ్డుకోవలసిన సమయం వచ్చింది. ఇది మనందరి సమష్టి బాధ్యతగా భావించాలి.తెలుగుదేశానికి ఉన్న సంస్థాగత నిర్మాణ బలాన్ని ఉపయోగించుకొని జనసేనకున్న జనాదరణను జోడించి ఈ ఎన్నికల్లో మన అభ్యర్థిని గెలిపించుకుందాం' అని సూచించారు.పార్టీ కోసం తొలి నుంచీ బాధ్యతగా వ్యవహరించిన ప్రతి నాయకుడికీ, కార్యకర్తకీ తగిన గుర్తింపు, ప్రాముఖ్యం ఇస్తామని చెప్పారు. తిరుపతి ఇంఛార్జి కిరణ్ రాయల్‌తో విడిగా భేటీ అయిన పవన్ కళ్యాణ్ తొలి నుంచీ తిరుపతిలో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన సంగతి, వైసీపీ నేతల వేధింపులకు గురై పోలీసు కేసులతో సతమతమైన సంగతి తనకు తెలియంది కాదన్నారు. అలాంటిది ఎన్నికల సమయంలో పార్టీని ఇబ్బంది పెట్టవద్దని కోరారు. కుటుంబానికి తనను పెద్దన్నగా భావించాలని, తనపై నమ్మకం వుంచాలని సూచించారు. దీంతో మెత్తబడిన కిరణ్ రాయల్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం తనవంతు కృషి చేసేందుకు అంగీకరించారు.జనసేన ప్రధాన కార్యదర్శులు కె.నాగబాబు, టి.శివశంకర్, రాష్ట్ర అధికార ప్రతినిధి అజయ కుమార్, కోశాధికారి ఎ.వి.రత్నం ,తిరుపతి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, ఉమ్మడి చిత్తూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు పి.హరిప్రసాద్,నగర అధ్యక్షుడు జె.రాజారెడ్డి, పార్టీ నేతలు పగడాల మురళి, హరి, దినేష్ జైన్, మల్లి, వెంకట్ తదితరులు హాజరయ్యారు. అలాగే తిరుపతి పర్యటనలో భాగగా నగరానికి చెందిన ప్రముఖులు, విద్యావేత్తలు, వ్యాపారవేత్తలు, వైద్యులు, తటస్థులతో పవన్ సమావేశమయ్యారు. వైసీపీ వ్యతిరేక ఓటు చీలనివ్వననే ప్రకటన ఏ ఉద్దేశంతో చేసిందీ చెబుతూ కూటమి ఏర్పాటు, కూటమి ప్రభుత్వం ద్వారా రాష్ట్రాన్ని ఏ విధంగా రక్షించుకుంటామనేది వారికి వివరించారు.



పవన్‌తో సుగుణమ్మ, ఆరణి శ్రీనివాసులు, టీడీపీ నేతలు

- చల్లబడ్డ టీడీపీ నేతలు
- ఆరణి శ్రీనివాసులుతో కలసి పనిచేయండి... మీ కష్టాన్ని వృధా కానివ్వమంటూ భరోసా
- మరో దశాబ్దంపాటు చంద్రబాబుతో కలిసి నడవాలని వుందన్న జనసేనాని

ఫలించిన పవన్ భేటీ

తిరుపతి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ తిరుపతి టీడీపీ నేతలతో జరిపిన భేటీ ఫలించింది. దాదాపు గంటపాటు ఆయన సుదీర్ఘంగా మాట్లాడిన తీరుతో టీడీపీ ముఖ్యనాయకులు చల్లబడ్డారు. జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులుతో కలిసి పనిచేసేందుకు సూత్రప్రాయంగా అంగీకరించారు.తిరుపతి అసెంబ్లీ ఎన్డీఏ అభ్యర్థిగా జనసేన తరఫున ఆరణి శ్రీనివాసులును ప్రకటించి మూడు వారాలు కావస్తున్నా..ఇంకా కొందరు అలకపాన్పు దిగకపోవడంపై పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా దృష్టిసారించారు. శుక్రవారం సాయంత్రం ప్రత్యేక విమానంలో తిరుపతికి చేరుకున్నారు.తిరుచానూరు సమీపంలోని గ్రాండ్ రిడ్జ్ హోటల్లో కూటమి పార్టీలతో విడివిడిగా మాట్లాడారు. ముందుగా టీడీపీకి చెందిన 30 మంది ముఖ్యనేతలతో ఆయన భేటీ అయ్యారు. 'ఆరణి శ్రీనివాసులు అభ్యర్థిత్వం టీడీపీ అధినేత చంద్రబాబు , నేనూ కలిసి తీసుకున్న నిర్ణయం. ఆయన టికెట్ కోసం పార్టీలో చేరలేదు. చేరిన తర్వాతే టికెట్ ఇస్తామని చెప్పాం. అతను నాన్ లోకల్ అంశాన్ని తెరపైకి తీసుకొస్తున్నారు. స్థానికేతరుడు ఎందుకవుతారు? టీడీపీ, ప్రజారాజ్యం పార్టీలకు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. చంద్రబాబుకు బాగా సన్నిహితుడు. తిరుపతిలో సొంత ఇల్లు కూడా ఉంది. కాంట్రాక్టర్‌గా తిరుపతిలో ఎన్నో అభివృద్ధి పనులు చేశారు. కలసి పనిచేయండి. ఫలితాల తర్వాత మీకష్టాన్ని వృథాకానివ్వం' అంటూ రెండు చేతులు జోడించి విజ్ఞప్తి చేయడంతో అసమ్మతి నేతలు సైతం కాసేపు ఆలోచనలో పడి కలిసి పనిచేయడానికి అంగీకరించారు. టీడీపీ ఇంఛార్జి సుగుణమ్మ కష్టం కూడా అందరికీ తెలుసునని, గత ఎన్నికల్లోనే ఆమె గెలిచారని, ఆమెకు ఏమి చేయాలో చేస్తామని హామీ ఇచ్చారు. ఆమెతో మళ్లీ ప్రత్యేకంగా మాట్లాడతానన్నారు. ఆరణి శ్రీనివాసులు గెలుపుకన్నా అరాచక శక్తుల ఓటమే లక్ష్యంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. చంద్రబాబును అక్రమంగా జైల్లో పెట్టిన క్రమంలో.. అమెరికా అధ్యక్షులను ఏపీకి తీసుకొచ్చిన వ్యక్తి అలా జైలుగోడల మధ్య ఉండడం చూసి తాను చలించిపోయానన్నారు. కష్టకాలంలో అండగా ఉండాలని భేషరతుగా అక్కడే మద్దతు ప్రకటించానని, ఆ తర్వాత బీజేపీ నేతలు నరేంద్ర మోదీ, అమిత్ షాలతో మాట్లాడి కూటమిలో టీడీపీని చేర్చేందుకు కీలకంగా పనిచేశానన్నారు. తాను 45 సీట్లు అడిగితే 24 సీట్లకు తగ్గాల్సి వచ్చిందని, బీజేపీ వాళ్ల కోసం మరో 3 వదులుకుని 21 సీట్లకే పరిమితమయ్యానన్నారు. కేంద్రంలో బీజేపీ, ఏపీలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తాయని సర్వేలన్నీ చెబుతున్నాయని, కేంద్ర సహకారం కావాలంటే బీజేపీ అవసరమనే ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. దశాబ్దకాలం పాటు దార్శనికుడైన చంద్రబాబుతో కలిసి నడవాలనుకుంటున్నానని స్పష్టం చేశారు. జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు మాట్లాడుతూ తాను అనకాపల్లి టికెట్ ఆశించి నెల రోజులు ప్రచారం చేశానని...పొత్తులో భాగంగా వేరేవాళ్లకు ఇవ్వాల్సి రావడంతో తప్పుకున్నానన్నారు. ఈ భేటీలో ఎస్వీ ప్రసాద్, మాజీ ఎమ్మెల్యేలు మోహన్, సుగుణమ్మ, టీడీపీ నాయకులు నరసింహ యాదవ్, మబ్బు దేవనారాయణ రెడ్డి, ఆర్సీ మునికృష్ణ, ఊకా విజయకుమార్, జేబీ శ్రీనివాస్, ఊట్ల సురేంద్ర నాయుడు, చినబాబు, మహేష్ యాదవ్, కంకణాల రజనీకాంత్ , ఆర్సీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎపిక్ కార్డుల వ్యవహారంపై విచారణ సాగుతోంది

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా



మహిళా వర్సిటీలో ఓటరు ప్రతిజ్ఞ చేయిస్తున్న ముఖేష్ కుమార్ మీనా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 12 : తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల సందర్భంగా 35 వేల ఎపిక్ కార్డులు అక్రమంగా డౌన్‌లోడ్ చేసిన వ్యవహారంపై విచారణ కొనసాగుతోందని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా వెల్లడించారు.తిరుపతిలోని మహిళా విశ్వవిద్యాలయంలో శుక్రవారం ఉదయం ఆయన ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఎపిక్ కార్డుల వ్యవహారంతో ప్రమేయం వున్న వారు ఏ స్థాయి వ్యక్తులైనా ఉపేక్షించే సమస్య లేదన్నారు. ఇప్పటికే బాధ్యులైన వారిపై శాఖాపరమైన విచారణ జరుగుతోందని, మరో వైపు పోలీసులు నమోదు చేసిన క్రిమినల్ కేసు దర్యాప్తు కొనసాగుతోందన్నారు.ముగ్గురు కంప్యూటరు ఆపరేటర్ల వద్ద అలాగే ఆర్డీవో కార్యాలయం నుంచీ కంప్యూటర్ హార్డు డిస్కులు స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించడం జరిగిందన్నారు.ఎపిక్ కార్డులు డౌన్ లోడ్ చేసిన కంప్యూటర్ల ఐపీ అడ్రసులు వంటి సాంకేతికపరమైన వివరాలను అందించాలని ఈసీని దర్యాప్తు అధికారులు కోరారని,ఆ వివరాలను ఈసీ అందజేస్తుందని వెల్లడించారు.పోలీసు దర్యాప్తు ముగిశాక ఎపిక్ కార్డులను ఎవరు డౌన్‌లోడ్ చేయించారో తెలుస్తుందని, వారిపై తగిన చర్యలుంటాయని స్పష్టం చేశారు.

ఇంటర్ ఫలితాల్లో 7వ స్థానం

- ప్రభుత్వ కళాశాలల్లో తగ్గిన ఉత్తీర్ణత
- ఉత్తీర్ణతలో అమ్మాయిలదే ఆధిపత్యం





ఆర్ఐవో ప్రభాకర రెడ్డి

తిరుపతి(విద్య), ఏప్రిల్ 12 : ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో తిరుపతి జిల్లా ఏడవ స్థానంలో నిలిచింది. ఈ ఏడాది తొలిసారిగా 26 జిల్లాల ప్రాతిపదికన నిర్వహించిన పరీక్షల్లో ప్రథమ ఇంటర్‌లో 29,915 మందికిగాను 20,919 మంది విద్యార్థులు పాసయ్యారు. 70 శాతం ఉత్తీర్ణతతో జిల్లాను 7వ స్థానంలో నిలిపారు. ద్వితీయ ఇంటర్‌లో 25,990 మంది విద్యార్థులకుగాను 21,062 మంది పాసయ్యారు. 81 శాతం ఉత్తీర్ణతతో జిల్లాను 7వ స్థానంలో నిలిపారు.ఒకేషనల్ విభాగం ప్రథమలో 1,086 మందికిగాను 595మంది పాసై 55 శాతం, ద్వితీయలో 963మందికి 652 మంది పాసై 68 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ఆర్ఐవో జీవీ ప్రభాకర రెడ్డి తెలిపారు.గతంలోలాగే ఈ ఏడాది కూడా ఉత్తీర్ణతలో అమ్మాయిలే ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. ప్రథమ సంవత్సర జనరల్ విభాగంలో 15,319 బాలురకుగాను 10,220 మంది పాసై 67 శాతం ఉత్తీర్ణత నమోదుచేయగా 14,596 మంది బాలికలకుగాను 10,699 మంది పాసై 73 శాతం ఉత్తీర్ణత సాధించారు.ద్వితీయ సంవత్సర బాలుర విభాగంలో 13,012 మందికిగాను 10,218 మంది పాసై 79 శాతం ఉత్తీర్ణత నమోదు చేయగా 12,978 మంది బాలికలకు 10,844 మంది పాసై 84 శాతం ఉత్తీర్ణత సాధించారు.ప్రథమ ఒకేషనల్లో 586 మంది బాలురకు 250 మంది పాసై 43 శాతం ఉత్తీర్ణత సాధించగా 500 బాలికలకు 345 మంది పాసై 69 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు.ద్వితీయ ఒకేషనల్‌లో 477మంది బాలురకు 248 మంది పాసై 52 శాతం ఉత్తీర్ణత నమోదు చేయగా 486 మంది బాలికలకు 404 మంది పాసై 83 శాతం ఉత్తీర్ణత సాధించారు.

ప్రభుత్వ, హైస్కూల్ ప్లస్‌లలో తగ్గిన ఉత్తీర్ణత

ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలలు ఆశించినంత ఉత్తీర్ణత సాధించలేకపోయాయి. 21 ప్రభుత్వ కళాశాలల నుంచి ప్రథమలో 1707 మందికిగాను 684 మంది ఉత్తీర్ణులు కాగా ద్వితీయలో 1434 మందికిగాను 755 మంది ఉత్తీర్ణులయ్యారు. అలాగే ఒకేషనల్ ప్రథమలో 830 మందికి 432మంది పాస వ్వగా ద్వితీయలో 707మందికి 473మంది పాసయ్యారు. 20 హైస్కూల్ ప్లస్‌లకు సంబంధించి ప్రథమలో 533మందికి 173మంది పాసవగా ద్వితీయలో 226 మందికి కేవలం 95మంది మాత్రమే ఉత్తీర్ణులు కావడం గమనార్హం.

100శాతం ఉత్తీర్ణత

సత్యవేడు ప్రభుత్వ జూనియర్ కళాశాల, అంబేడ్కర్ బాలికల గురుకుల కళాశాల విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు.ఎంపీసీ విద్యార్థిని మునిశ్రీ 939 మార్కులు, దిలీప్‌కుమార్ 920, బైపీసీలో వినోలియా 949 మార్కులు సాధించారు.మొదటి సంవత్సరం ఎంపీసీలో 470 మార్కులకు గాను లక్ష్మీప్రసాద్ 458, తనుష్ 446, మార్కులు సాధించారు.గురుకుల కళాశాలలో బైపీసీలో డి.లావణ్య 986,మొదటి సంవత్సరం ఎంపీసీలో రోజా 463, త్రిష 461, మానస 459, బైపీసీలో 440 మార్కులకు గాను గీతిక 427,హర్షిత 426, భువన భాషిత 421మార్కులు సాధించారు.దొరవారిసత్రం మండలంలోని కస్తూర్బా కళాశాల కూడా వందశాతం ఉత్తీర్ణత సాధించింది.

మే 24నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మే 24 నుంచి జూన్ 1 వరకు జరగనున్నాయి. ప్రతీ రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30వరకు రెండు సెషన్లలో ప్రథమ, ద్వితీయ విద్యార్థులకు పరీక్షలు జరుగనున్నాయి. అంతకంటే ముందు మే ఒకి నుంచి 4వ తేదీ వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ప్రాక్టికల్ పరీక్షలు జరుగనున్నాయి. ఈ పరీక్షలకు సంబంధించి ఈనెల 18 నుంచి 24వ తేదీలోపు విద్యార్థులు ఫీజు చెల్లించాల్సి వుంటుంది. కాగా ఇంటర్ ఫలితాల్లో తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులు, ఫెయిల్ అయినవారు ఎలాంటి ఆందోళనకు, ఒత్తిడికి లోనుకావద్దని విద్యార్థులు తల్లిదండ్రులుకూడా పిల్లలకు మనోధైర్యాన్ని కల్పించి అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా ప్రోత్సహించాలి.

మేనేజ్‌మెంట్ల వారీగా ఫలితాలు

ఏపీఆర్జేసీ కళాశాల నుంచి ప్రథమ ఇంటర్ జనరల్ విభాగంలో 94మంది విద్యార్థులకుగాను 81మంది పాసవ్వగా ద్వితీయలో 68మందికిగాను 61మంది పాసయ్యారు.నాలుగు ఎయిడెడ్ కళాశాలల నుంచి ప్రథమలో 1559మందికిగాను 1011మంది పాసవగా ద్వితీయలో 1281మందికిగాను 1003మంది పాసయ్యారు. 10 సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాలలకు సంబంధించి ప్రథమలో 583మందికిగాను 498 మంది, ద్వితీయలో 585 మందికిగాను 520మంది ఉత్తీర్ణులయ్యారు. మూడు ట్రైబల్ వెల్ఫేర్ కళాశాలల నుంచి ప్రథమలో 247మందికిగాను 193 మంది, ద్వితీయలో 214మందికి 176మంది పాసయ్యారు. రెండు బీసీ రెసిడెన్షియల్ కళాశాలలనుంచి ప్రథమలో 240 మందికిగాను 238 మంది, ద్వితీయలో 172మందికిగాను 169 మంది ఉత్తీర్ణులయ్యారు.రెండు ఇన్సెంటివ్ కళాశాలల్లో ప్రథమలో 77 మందికి 29 మంది, ద్వితీయలో 83మందికి 54మంది, 5 కేజీబీవీల్లో ప్రథమలో 127మందికి 71మంది, ద్వితీయలో 109మందికి 87మంది, ఐదు ఏపీ మోడల్ స్కూళ్లలో ప్రథమలో 264మందికి 133మంది, ద్వితీయలో 282మందికి 219మంది ఉత్తీర్ణులయ్యారు.111 ప్రైవేటు అన్‌ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో ప్రథమలో 24388 మందికి 17743మంది, ద్వితీయలో 21449 మందికి 17839 మంది ఉత్తీర్ణులయ్యారు.ప్రైవేటు కాంపోజిటివ్ కళాశాలలకు సంబంధించి ప్రథమలో 96మందికిగాను 65మంది, ద్వితీయలో 87మందికిగాను 84మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తంగా 185 కళాశాలలకు సంబంధించి ప్రథమలో 29915 మందికిగాను 20919మంది, ద్వితీయలో 25990 మందికిగాను 21062మంది, ఒకేషనల్ ప్రథమలో 1086 మందికి 595మంది, ద్వితీయలో 963మందికి 652మంది ఉత్తీర్ణులయ్యారు.

పద్మావతి వర్సిటీలో స్వీప్ సెల్ఫీ పాయింట్ ప్రారంభం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 12 : ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా మహిళా యూనివర్సిటీలో ఏర్పాటైన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా శుక్రవారం ఉదయం పరిశీలించారు. యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ కాలేజీలో ఏర్పాటైన స్ట్రాంగ్ రూమ్‌ను, కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను ఆయన తనిఖీ చేశారు.ఈ కేంద్రాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. అనంతరం యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ ఆవరణలో స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్‌ను ప్రారంభించారు. అక్కడే ఓటు హక్కు వినియోగంపై విద్యార్థినుల చేత ప్రతిజ్ఞ చేయించారు. 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఓటు వేద్దాం.. ప్రజాస్వామ్యాన్ని గెలిపిద్దాం అంటూ నినదించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎస్పీ కృష్ణకాంత్ పటేల్, జేసీ ధ్యానచంద్ర, నగరపాలక కమిషనర్ అదితిసింగ్, డీఆర్వో పెంచల కిషోర్ పద్మావతి వర్సిటీ వీసీ భారతి, రిజిస్ట్రార్ రజని, ఆర్డీవో నిషాంత్‌రెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాకాల, ఏప్రిల్ 12: పాకాల మండలంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ డీఈఈ పి.నరేంద్ర తెలిపారు. 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 6-30 నుంచి మధ్యాహ్నం 12-30 గంటల వరకు విద్యుత్ సరఫరా వుండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

టోఫెల్ పరీక్షల పర్యవేక్షణ



టోఫెల్ పరీక్షలను పరిశీలిస్తున్న అధికారులు

ఎర్రావారిపాలెం, ఏప్రిల్ 12 : జిల్లాలో జరుగుతున్న టోఫెల్ పరీక్షలను విద్యాశాఖ సెక్టోరియల్ అధికారులు పరిశీలించారు. మూడవ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఆంగ్ల భాష నైపుణ్యాలు పెంపొందించేందుకు టోఫెల్ పరీక్షలను అధికారులు ఈ ఏడాది నుంచి అమలు చేస్తున్నారు. పరీక్షల తీరుతెన్నులను సమగ్ర సెక్టోరియల్ అధికారులు చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాలెం మండలాల్లో పర్యవేక్షించారు. దీంతో పాటు 6, 7, 8, 9 తరగతుల ఐఎఫ్‌పీ ప్యానల్స్, ట్యాబ్స్, స్మార్ట్ టీవీ ద్వారా ఆడియో క్లిప్పింగ్స్ పనితీరును తెలుసుకున్నారు. ఈ పర్యటనలో ఎస్ఎస్‌ఏ సారథి, గోపాల్ కృష్ణ, రుక్మానంద, రాము తదితరులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్‌కు ఘనస్వాగతం



రేణిగుంట, ఏప్రిల్ 12: జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. శుక్రవారం రాత్రి ప్రత్యేక విమానంలో విజయవాడ నుంచి వచ్చిన ఆయనకు జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, పార్టీ నాయకులు హరిప్రసాద్, వినుత, చంద్రబాబు, రాజారెడ్డి, ఎన్వీప్రసాద్, టీడీపీ నాయకులు సుగుణమ్మ, కృష్ణయాదవ్, బీజేపీ నాయకులు కోలా ఆనంద్ స్వాగతం పలికారు.

శాస్త్రోక్తంగా లలితా హోమం

రామచంద్రాపురం, ఏప్రిల్ 12: రాయలచెరువుకట్ట శక్తిపీఠంలో వసంత నవ రాత్రుల సందర్భంగా వేదపండితులు శాస్త్రోక్తంగా శుక్రవారం లలితా హోమం నిర్వహించారు. కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరభారతిస్వామి, శక్తి పీఠాధిపతి రమ్యానంద భారతి 12 గంటలకు పూర్ణాహుతితో హోమం నిర్వహించారు.

నానీని గెలిపించుకుందాం



సమావేశంలో మాట్లాడుతున్న జీవరత్నం

రామచంద్రాపురం, ఏప్రిల్ 12: టీడీపీ, జనసేన, బీజేపీ కలిసికట్టుగా పనిచేసి చంద్రగిరి ఎమ్మెల్యేగా పులిర్తి నానీని గెలిపించుకుందామని టీడీపీ మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి కోరారు.గంగిరెడ్డిపల్లి పంచాయతీ పద్మవల్లిపురంలో శుక్రవారం రాత్రి జయహో బీసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ప్రధాన కార్యదర్శి జీవరత్నం మాట్లాడుతూ టీడీపీ పాలనలోనే బీసీలకు సరైన రాజకీయ పదవులతో పాటు గుర్తింపు వచ్చిందన్నారు. జిల్లా నాయకులు జనార్ధన చౌదరి, హరిప్రసాద్, సురేంద్రనాయుడు, నరసింహా రెడ్డి, ఢిల్లీనాథరెడ్డి, మండల నాయకులు ప్రసాద్, గిరినాయుడు, దినేష్‌నాయుడు, గురుప్రసాద్ రెడ్డి, వాసు, గోపి, మహేష్‌నాయుడు, జగదీష్ పాల్గొన్నారు.

ఈవీఎం ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

● ఈవీఎం తరలించే వాహనాలకు జీపీఎస్ సిస్టమ్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 12: మొదటి విడత ఈవీఎం, వీవీ ప్యాట్స్ ర్యాండమైజేషన్ ప్రక్రియ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పూర్తి చేసినట్లు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం రాజకీయ పార్టీల నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు తిరుపతి పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించిన కంట్రోల్ యూనిట్స్, బ్యాలెట్ యూనిట్స్, వీవీ ప్యాట్‌ల ర్యాండమైజేషన్ ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్‌లో ఆన్‌లైన్ ద్వారా చేపట్టి పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈవీఎం, వీవీ ప్యాట్స్ యంత్రాలు తరలించే వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ ఉంటుందని సెక్యూరిటీ ప్రోటోకాల్ ప్రకారం పటిష్ట పోలీసు బందోబస్తుతో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు ఈవీఎం, వీవీ ప్యాట్స్ యంత్రాలను పంపిస్తామన్నారు.డీఆర్వో కిషోర్, ఈఆర్వోలు అదితిసింగ్, నిషాంత్‌రెడ్డి, చంద్రముని కిరణ్‌కుమార్, రామ్మోహన్, నరసింహులు, టీడీపీ నుంచి మనోహరాచారి, వైసీపీ నుంచి చంద్రశేఖర రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నుంచి రవి, అమ్‌ఆద్మీ పార్టీ ప్రతినిధి నగేష్ తదితరులు హాజరయ్యారు.

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 12: జిల్లాలో వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి.వెంకటగిరిలో 108మంది,శ్రీకాళహస్తిలో 65మంది, గూడూరులో 60మంది, సూళ్ళూరుపేటలో 48మంది, తిరుపతి అర్బన్‌లో 34మంది, చంద్రగిరిలో 21మంది రాజీనామా చేశారు.జిల్లాలో వాలంటీర్ల రాజీనామాల సంఖ్య 354మందికి చేరిందని అధికారులు తెలిపారు. కొన్ని చోట్ల వైసీపీ నేతలు వలంటీర్లను తమ కార్యాలయాలకు పిలిపించుకుని బెదిరించి మరీ రాజీనామాలు చేయిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

చంద్రగిరిలో 22 మంది..

చంద్రగిరి, ఏప్రిల్ 12: చంద్రగిరి ఒకటవ సచివాలయ పరిధిలో 22 మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు.

డాక్టరేట్ ప్రదానం



హిమశైల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 12: పద్మావతి యూనివర్సిటీ ఫార్మసీ పరిశోధకురాలు ఎం.హిమశైల డాక్టరేట్ పొందారు. స్టడీస్ ఆన్ ప్రొటెక్టివ్ రోల్ ఆఫ్ సెలెక్టెడ్ ఇండియన్ స్పైసెస్ ఇన్ సెరిబ్రల్ కిస్కీమియా రీఫర్ఫుసిసిన్ ఇంజురీ అంశంపై డాక్టర్ సంత్రాణి ఠాకూర్ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినట్టు పీఆర్వో శ్రీరజని తెలిపారు.

బలిజలను హింసించిన వైసీపీ ప్రభుత్వం

● బలిజ జేఏసీ



తిరుపతి అర్బన్, ఏప్రిల్ 12: ఐదేళ్ల వైసీపీ పాలనలో బలిజలను నానా రకాలుగా హింసించారని, తమ సామాజిక వర్గాన్ని పూర్తిగా మోసం చేశారని బలిజ జేఏసీ కన్వీనర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి ఏసుదాసు విమర్శించారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఆ పార్టీ నాయకులు రాష్ట్రాన్ని దోచుకున్నారని, అన్ని వర్గాల ప్రజలు, వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. సీఎం జగన్ పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలలో ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. కాపు కార్పొరేషన్‌కు ఒక్క రూపాయి నిధులు కేటాయించలేదని వాపోయారు. బలిజ భవన నిర్మాణం ఊసెత్తలేదని ఆరోపించారు. గ్రేటర్ రాయలసీమలో బలిజలకు ఒక్క ఎమ్మెల్యే సీటు ఇవ్వకుండా చిన్నచూపు చూశారని మండిపడ్డారు. కూటమిని గెలిపిస్తే బలిజలకు న్యాయం జరుగుతుందని 13 జిల్లాల్లోని ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమం చేస్తున్నామన్నారు. కాపు జేఏసీ నేతలు ఆర్యన్ రాజేష్, వరప్రసాద్, హేమకుమార్, లక్ష్మీపతి, నాగరాజు, మురళి పాల్గొన్నారు.

వినియోగంలోకి తిరుచానూరు రైల్వేస్టేషన్

● 16 నుంచీ తాత్కాలికంగా కొన్ని రైళ్లు అక్కడి దాకానే



తిరుపతి సెంట్రల్ ఏప్రిల్ 12: నత్తలా నిర్మాణం సాగుతున్న తిరుచానూరు రైల్వే స్టేషన్ పనులు పూర్తి కాకనే వినియోగంలోకి రాబోతోంది. ఈ నెల 16 నుంచీ కొన్ని రైళ్ల ఈ స్టేషన్ నుంచే రాకపోకలు సాగిస్తాయని దక్షిణ రైల్వే శుక్రవారం ప్రకటించింది. ఆ ప్రకారం, నెం.06727 మూర్ మార్కెట్ కాంప్లెక్స్ - తిరుపతి మెమో ఎక్స్‌ప్రెస్, నెం.06753 అరక్కోణం - తిరుపతి మెమో ఎక్స్‌ప్రెస్, నెం.16057 చెన్నై సెంట్రల్ - తిరుపతి సప్తగిరి ఎక్స్‌ప్రెస్, నెం.16053 చెన్నై సెంట్రల్ - తిరుపతి ఎక్స్‌ప్రెస్ తిరుపతికి బదులుగా తిరుచానూరు వరకు మాత్రమే నడుస్తాయి. అలాగే, నెం.16854/16853 విల్లుపురం - తిరుపతి - విల్లుపురం ఎక్స్‌ప్రెస్ రైళ్ల తిరుపతికి బదులుగా కాట్పాడి వరకే నడుస్తాయని దక్షిణ రైల్వే తెలిపింది. తిరుచానూరు స్టేషన్‌లో మూడు ప్లాట్‌ఫారాలు మాత్రమే ఉన్నాయి. ఇక్కడ ప్రస్తుతం ప్యాసింజర్ రైళ్లను పార్కింగ్ చేస్తున్నారు. భవన నిర్మాణాలు, రేకులషెడ్ల పనులు జరుగుతూనే ఉన్నాయి. 30 శాతం పనులు పూర్తి కావాల్సి ఉంది. అయితే తిరుపతిలో నిర్మాణ పనుల వల్ల తిరుచానూరు స్టేషన్‌ను వినియోగంలోకి తీసుకువస్తున్నారు. దీంతో అనధికారికంగానే తిరుచానూరు స్టేషన్ ప్రారంభం అయినట్లు భావించాల్సి ఉంటుంది.

దారిమళ్లించిన రైళ్లు

రామేశ్వరం-ఓకల మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్, తిరుపతి, రేణిగుంట, కడప, గుత్తి మీద నడిచే ఎక్స్‌ప్రెస్ ఈనెల 16 నుంచి 23వరకు కాట్పాడి, పాకాల, ధర్మవరం, గుత్తి మీదుగా రాక పోకలు సాగిస్తాయి. నిజాముద్దీన్-త్రివేండ్రం (12644), మంగళూరు-సత్రాగంజ్(22852), శ్రీమోక్షగుండం విశ్వేశ్వరయ్య బెంగళూరు-టాటానగర్(12890), ఎస్ఎంవీబీ-హటియా (12836),నిజాముద్దీన్-ఎర్నాకులం (12646) చిత్తూరు, తిరుపతి మీదుగా వెళ్లాల్సిన ఎక్స్‌ప్రెస్‌లు కాట్పాడి, తిరుత్తణి, రేణిగుంట మీదుగా నడుస్తాయని తెలిపారు.

తిరుపతి-విశాఖపట్నం మధ్య బుధ, గురు, ఆదివారాల్లో నడుస్తున్న డబుల్ డెక్కర్లు ఎక్స్‌ప్రెస్‌లు(22708-22707) ఈనెల 17వ తేదీ 90 నిమిషాలు ఆలస్యంగా నడుస్తాయని అధికారులు తెలిపారు.

మద్యం పాలసీల్లో జగన్‌కు జైలు తప్పదు

- కూటమి నేతలు -



విలేకరులతో మాట్లాడుతున్న నరసింహ యాదవ్ తదితరులు

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 12 : మద్యం పాలసీల వ్యవహారంలో సీఎం జగన్ జైలుకెళ్లక తప్పదని కూటమి పార్టీల నేతలు నరసింహ యాదవ్, సామంచి శ్రీనివాస్, కీర్తన స్పష్టం చేశారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ మద్యం విషయంలో జగన్ నేతృత్వంలో దేశంలోనే అతిపెద్ద కుంభకోణం జరుగుతోందన్నారు. తద్వారా రూ.లక్ష కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. ఆ నగదుతోనే ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారన్నారు. నాసిరకం మద్యం విక్రయించి, ప్రజల ఆరోగ్యంతో ఆడుకుంటున్నారని తెలిపారు. మద్యం తయారు చేసే సంస్థలు జగన్ బినామీలవేనన్నారు. ఖజానాకు రావాల్సిన సొమ్ము జగన్ జేబుల్లోకి చేరిందని ఆరోపించారు. మద్యం విక్రయాలకు సంబంధించి కంప్యూటర్ డేటా డిలీట్ అయ్యిందని చెప్పడం దుర్మార్గమన్నారు. దీనిపై ఎన్నికల కమిషన్ విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మద్యం స్వాధీనం : 9 మంది అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 12 : జిల్లాలోని పలు ప్రాంతాల్లో సెబ్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించి మద్యం స్వాధీనం చేసుకున్నారు. 9 మందిని అరెస్టు చేశారు. కారు సీజ్ చేశారు. సెబ్ అదనపు ఎస్పీ రాజేంద్ర వివరాల మేరకు.... తిరుపతి రూరల్ పరిధిలో బి.చంద్ర నుంచి 10 బాటిళ్లు, వెంకటగిరి పరిధిలో కొత్తపల్లి మహేష్ నుంచి 12, పుత్తూరు పరిధిలో పద్మావతి నుంచి 20, సూళ్లూరుపేట పరిధిలో వళ్లూరు అంజమ్మ నుంచి 10, బీవీ పాలెం చెక్‌పోస్టు వద్ద తమిళనాడు నుంచి కారులో వస్తున్న నగేష్, దాసరి వినయ్‌కుమార్ నుంచి 9, శ్రీకాళహస్తిలో రాజశేఖర్ నుంచి 13, గూడూరు పరిధిలో జనార్ధన రెడ్డి నుంచి 12, నాయుడుపేట పరిధిలో మున్నేర్ పెరుమాల్ నుంచి 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్టు చేశారు.

చంద్రగిరిలో వేగంగా మారుతున్న సమీకరణలు

● నేడు టీడీపీలోకి బడి సుధా యాదవ్ ● 16న తొండవాడ వద్ద కాపులతో వంగవీటి రాధా భేటీ

తిరుపతి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): వంగవీటి రంగా తనయుడు, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధా ఈనెల 16వ తేదీన చంద్రగిరి నియోజకవర్గానికి రానున్నారు. మంగళ వారం ఉదయం తొండవాడ వద్ద ఓ ప్రైవేటు కళ్యాణ మండపంలో నియోజకవర్గ కాపులతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. మరో వైపు ఇటీవలి వరకూ చంద్రగిరి టీడీపీ టికెట్ కోసం గట్టిగా యత్నించిన యువనేత బడి సుధా యాదవ్ నారా లోకేశ్ సమక్షంలో నేడు టీడీపీలో చేరనున్నారు.గురువారం డాలర్స్ దివాకర్‌రెడ్డి టీడీపీలో చేరడం, నేడు సుధా యాదవ్ చేరనుండడం, మరో వైపు వంగవీటి రాధా రానుండడం వంటి పరిణామాలతో చంద్రగిరి నియోజకవర్గంలో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి.

చంద్రగిరి నియోజకవర్గంలో ఈ సారి ఎలాగైనా గెలవాలని కసితో పనిచేస్తున్న టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీ ఎలాంటి భేషజాలకూ పోవడం లేదు. తనకు కలిసివచ్చే ఏ అంశాన్నీ నిర్లక్ష్యం చేయడం లేదు. రోజురోజుకూ పార్టీ బలాన్ని పెంచుకునే దిశగా గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగా నెల రోజుల నుంచీ నియోజకవర్గంలో వైసీపీ నుంచీ అలాగే తటస్థుల నుంచీ పెద్దఎత్తున టీడీపీలోకి చేరికలు జరుగుతున్నాయి. అలా చేరుతున్న వారిలో వైసీపీకి ఇంతకాలం బలంగా నిలిచిన ముఖ్యనేతలు సైతం వుండడం గమనార్హం. వన్యకుల క్షత్రియ సామాజికవర్గంలో పట్టున్న తిరుచానూరు మాజీ సర్పంచ్ సీఆర్ రాజన్‌ను ఏకంగా చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడిగా నియమించడం నుంచీ, పాకాల మండల వైసీపీ ముఖ్యనేతలు వైసీపీలో చేరడం తెలిసిందే. చంద్రగిరి టీడీపీ టికెట్ ఆశించిన డాలర్స్ దివాకరరెడ్డి, బడి సుధా యాదవ్‌లలో దివాకరరెడ్డి ఇప్పటికే టీడీపీలో చేరిపోగా, బడి సుధా యాదవ్ నేడు పార్టీలో చేరనున్నారు. వీరిద్దరి చేరిక నిస్సందేహంగా టీడీపీకి బాగా అనుకూలించే అంశం. మరోవైపు వంగవీటి రాధాను చంద్రగిరికి రప్పించడానికి పులివర్తి నానీ చేసిన యత్నాలు ఫలించాయి. నియోజకవర్గంలో బలిజ సామాజిక వర్గం గణనీయంగా వున్న నేపథ్యంలో వంగవీటి రాధాను రప్పించి బలిజలను పార్టీ వైపు మళ్లించేందుకు నానీ యత్నిస్తున్నారు. నానీ ప్రయత్నాలతో రాధా వచ్చే మంగళవారం చంద్రగిరి రానున్నట్లు తెలిసింది. తొండవాడ వద్ద ఓ కళ్యాణ మండపంలో సంబంధిత సామాజికవర్గంతో ఆయన సమావేశమై టీడీపీకి మద్దతివ్వాల్సిందిగా కోరనున్నట్టు సమాచారం. ఆయన రాక సందర్భంగా పులివర్తి నానీ భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పరిణామాలన్నీ కలగలిపి నియోజకవర్గంలో టీడీపీకి గణనీయ లబ్ధి చేకూర్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి.



వేద వర్సిటీలో నూతన భవనం ప్రారంభం

తిరుపతి రూరల్, ఏప్రిల్ 12: టీటీడీ ఆధ్వర్యంలో నడిచే ఎస్వీ వేద వర్సిటీలో సంధ్యా వందనం, అనుష్టానం, అగ్నికార్యం చేసుకునేందుకు కొత్తగా నిర్మించిన నూతన భవనాన్ని శుక్రవారం ప్రారంభించారు. వీసీ ప్రొఫెసర్ రాణిసదాశివ మూర్తి, రిజిస్ట్రార్ రాధాగోవింద త్రిపాఠి, అకడమిక్ డీన్ గోని సుబ్రహ్మణ్యశర్మ, ఈఈ మల్లికార్జున ప్రసాద్, డీఈ మదన్‌మోహన్, ఏఈ వెంకటరమణ, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ పాలనలోనే బీసీలకు భరోసా



జయహో బీసీ కార్యక్రమంలో మాట్లాడుతున్న పులివర్తి సుధారెడ్డి

పాకాల, ఏప్రిల్ 12: తెలుగుదేశం పార్టీ పాలనలోనే బీసీలకు భరోసా అని పులివర్తి సుధారెడ్డి అన్నారు. మండలంలోని పదిపుట్లబైలు, మద్దినాయనిపల్లె గ్రామాలలో శుక్రవారం జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ టీడీపీ, జనసేన పార్టీ అధినేతలు నారా చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు బీసీల అభ్యున్నతి కోసం 10 అంశాలతో బీసీ డిక్లరేషన్ ప్రకటించారన్నారు. వైసీపీ పాలనలో బీసీలను పదవులకు దూరం చేశారని, సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించారని ఆరోపించారు. బీసీ కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసిన వైసీపీ ప్రభుత్వం నిధులు కేటాయించలేదన్నారు. పులివర్తి నానిని ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల టీడీపీ జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నేతలు



తిరుపతి రూరల్, ఏప్రిల్ 12:తిరుపతి రూరల్ మండలంలోని శ్రీనివాసపురం పంచాయతీకి చెందిన పలువురు వైసీపీ నేతలు శుక్రవారం టీడీపీలో చేరారు. ఉప సర్పంచి జేబీ సునీల్ చౌదరి, వార్డు సభ్యుడు మురళి, ఓటేరు పంచాయతీ వార్డు సభ్యుడు మధు, రవి, పవన్‌రెడ్డి, లోకేష్, దినేష్, చంద్ర, సురేష్, చందు చౌదరి తదితరులు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సమక్షంలో పసుపు కండువాలు కప్పుకున్నారు.


‘భూమన’ వేషాలు ఇక పనిచేయవు

● పదో క్లస్టర్లో పోటెత్తిన ఎన్డీఏ కూటమి శ్రేణులు ● ఇస్త్రీ చేస్తూ, దోసెలు వేస్తూ ఆరణి వినూత్న ప్రచారం



గజమాలతో ఆరణికి స్వాగతం పలుకుతున్న క్లస్టర్ ఇన్‌చార్జి ఆర్సీ మునికృష్ణ

తిరుపతి, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి) : భూమన కరుణాకరరెడ్డి, అభినయ్ రెడ్డి ఎన్ని వేషాలు వేసినా తిరుపతి ప్రజలు నమ్మే పరిస్థితులో లేరని టీడీపీ, బీజేపీ బలపరుస్తున్న జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు వ్యాఖ్యానించారు. శుక్రవారం పదో క్లస్టర్ ఇన్‌ఛార్జి ఆర్సీ మునికృష్ణ ఆధ్వర్యంలో 42, 43, 35, 44 డివిజన్లలో పెద్దఎత్తున ప్రచారం నిర్వహించారు. బట్టలు ఇస్త్రీ చేస్తూ, దోసెలు వేస్తూ గాజుగ్లాసు గుర్తుకు ఓటువేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఆయన మాట్లాడుతూ తిరుపతిలో అవినీతి పాలన అంతానికి ప్రజలు నిర్ణయం తీసుకున్నారని, వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అన్నారావు సర్కిల్ నుంచి ప్రారంభమైన ప్రచారం శాంతినగర్, ప్రశాంతి నగర్, సప్తగిరి నగర్, రైల్వే కాలనీ, కేటి రోడ్డులో జరిగింది. మహిళలు అడుగడుగునా హారతులు పట్టి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మోహన్,నాయకులు నరసింహ యాదవ్, మండలపు మోహన్‌రావు, పులుగోరు మురళి, శ్రీధర్ వర్మ, ఇందుశేఖర్, సోమల సురేష్, డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం,దంపూరు భాస్కర్, సురా సుధాకర్ రెడ్డి, పుష్పావతి యాదవ్, ఎడిపై ప్రణీత్, యూనిట్ ఇన్‌చార్జులు మహేష్ యాదవ్, ఊట్ల సురేంద్ర నాయుడు, శ్రీనివాస యాదవ్, ఆర్సీ శ్రీనివాసులు, శ్రీలక్ష్మి, రుద్రకోటి సదాశివం, ఆముదాల తులసీరాం, వార్డు అధ్యక్ష కార్యదర్శులు రూపేష్, ఎస్వీఎం శ్రీధర్, శంకర్, జగన్నాథం, సురేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, ధనంజయ, సింధూజ, రేవతి, జయంతి, వాణి, మునిరత్నం నాయుడు, గోళ్ల మధుసూదన్ నాయుడు, జనసేన నేతలు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, ఆకేపాటి సుభాషిణి, రాజారెడ్డి, ఆనంద్, బత్తిన మధుబాబు, రాజేష్ యాదవ్, మునస్వామి, చందులు, బీజేపీ నేతలు సామంచి శ్రీనివాస్, నాదముని రెడ్డి, ప్రేమ్‌కుమార్, నరేష్, మురళి, ప్రభాకర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఇస్త్రీ చేస్తున్న జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు

తిరుమల నగర్ పంచాయతీలో టీడీపీ ప్రచారం



మంగళం, ఏప్రిల్ 12: తిరుమలనగర్ పంచాయతీలో స్థానిక టీడీపీ కమిటీ ఆధ్వర్యంలో పులివర్తి నానీ గెలుపు కోసం శుక్రవారం ఇంటింటి ప్రచారం చేశారు. కమిటీ అధ్యక్షులు గోవిందరాజులు, కార్యదర్శి చెన్నరాయప్ప, ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీ అధ్యక్షులు ఈశ్వరయ్య, నాయకులు కృష్ణయ్య, పట్టాభి, జ్యోతికృష్ణ, గంగ, ప్రభాకర్, రాంజీ, దాము, మధు, జనసేన నాయకులు నవీన్, కిషోర్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమల మీదుగా హెలికాప్టర్ చక్కర్లు



తిరుమల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఆలయ ఆగమశాస్త్రానికి విరుద్ధంగా తిరుమల క్షేత్రంపై తరుచూ విమానాలు, హెలికాప్టర్లు ప్రయాణిస్తూనే ఉన్నాయి. తాజాగా శుక్రవారం సాయంత్రం 4 గంటల సమయంలో ఓ హెలికాప్టర్ తిరుమలపై చక్కర్లు కొట్టింది. తిరుమలను నోఫ్లైయింగ్ జోన్‌గా ప్రకటించాలని టీటీడీ ఉన్నతాధికారులు పలుమార్లు కేంద్రానికి లేఖ రాశారు. అది సాధ్యం కాదని కేంద్రం తేల్చిచెప్పింది. అయితే భక్తుల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని వీలైనంతవరకు రాకపోకలు లేకుండా ప్రయత్నిస్తామని చెప్పింది. కానీ ఇటీవల కాలంలో క్షేత్రంపై తిరిగే విమానాలు, హెలికాప్టర్ల సంఖ్య పెరిగింది.

కోలాహలంగా కోదండరాముడి రథోత్సవం



అశ్వవాహనం

తిరుపతి(కల్చరల్) ఏప్రిల్ 12: జైశ్రీరామ్ నినాదాల నడుమ కోదండరాముడి రథోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా సాగింది. స్వామి వారు రథంలో ఆలయ మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు కనువిందుచేశారు. కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు రథోత్సవం నిర్వహించారు. నగరం, పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై రథం లాగడానికి ఉత్సాహం చూపారు. డప్పు బృందాలు, కోలాటాలు, భజన బృందాలు ముందు సాగగా రథోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామి వారికి కర్పూర నీరాజనాలు పట్టారు. రథం యథాస్థానానికి చేరుకున్న తర్వాత అర్చకస్వాములు ప్రబంధం, వేదశాత్తుమొర నిర్వహించి, హారతి పట్టారు. మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు తిరుమంజనం, ఆస్థానం నిర్వహించారు. రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు కోదండరాముడు అశ్వవాహనంపై మాడవీధులలో విహరించారు. తిరుమల పెద్ద జీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్, ప్రధాన అర్చకులు ఏపీ ఆనందకుమార్ దీక్షితులు, కంకణబట్టార్ సీతారామాచార్యులు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో, రామచంద్ర పుష్కరిణి వేదిక వద్ద నిర్వహించిన సంగీత కార్యక్రమాలు అలరించాయి.

నేడు చక్రస్నానం : బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు కపిలతీర్థంలో చక్రస్నానం నిర్వహించనున్నారు.



స్వామివారి రథోత్సవం

చిత్తూరును పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దుదాం

టీడీపీ పార్లమెంటు అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాద రావు



చంద్రగిరిలో ప్రచారం నిర్వహిస్తున్న దగ్గుమళ్ళ ప్రసాదరావు

చంద్రగిరి, ఏప్రిల్12: చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గాన్ని పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ఎన్డీఏ కూటమి చిత్తూరు పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావు అన్నారు. శుక్రవారం చంద్రగిరిలో నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి మేడసాని పురుషోత్తం నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఇంటింటి ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. పంటలకు గిట్టుబాటు ధర దొరక్క రైతులు నానా తంటాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్డీఏ కూటమి గెలిచిన వెంటనే రైతన్నల సమస్యలకు పరిష్కార మార్గాన్ని చూపుతామని తెలియజేశారు. అదేవిధంగా చేనేతలకు చేయూతనిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, జనసేన నేత దేవర మనోహర్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా ప్రయోజనాలను పట్టించుకోని వైసీపీ

- జయహో బీసీ సమావేశంలో ప్రసాదరావు -

వైసీపీ ప్రభుత్వం ప్రజాప్రయోజనాలను పక్కనపెట్టి, స్వార్థ, ప్రతీకార రాజకీయాల లక్ష్యంగా ముందుకు సాగుతోందని ఎన్డీఏ కూటమి చిత్తూరు పార్లమెంటు అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావు విమర్శించారు. శుక్రవారం చంద్రగిరిలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో జరిగిన టీడీపీ జయహో బీసీ సమావేశానికి ఆయన ముఖ్యాతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ బీసీల పక్షపాతి తెలుగుదేశం అన్నారు. వైసీపీ బీసీలను తమ రాజకీయ స్వప్రయోజనాలకు వాడుకోవడం సిగ్గుచేటు అన్నారు. ఎన్డీఏ కూటమి బలపరిచిన అభ్యర్థులను ప్రజలు ఆశీర్వదిస్తే.. చిత్తూరు పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాలను అభివృద్ధి చేస్తామన్నారు. చిత్తూరు జిల్లాలోని తాగు, సాగునీటి సమస్యను పరిష్కరించేందుకు పనిచేస్తామన్నారు. రాష్ట్రంలోని ఆర్థిక, రాజకీయ, సామాజిక విషయాలపై చర్చించడానికి జగన్ రెడ్డితో సహా వైసీపీ నాయకులు ఎవరైనా తనతో పబ్లిక్ డిబేట్‌కు రాగలరా అని సవాలు విసిరారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, నాయకులు శివకోటిరెడ్డి, సప్తగిరిప్రసాద్, రమేష్‌రెడ్డి, సింగు సుధా, నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి మేడసాని పురుషోత్తమ నాయుడు, నాయకులు రాజేంద్ర నాయుడు, నరేష్ కుమార్‌నాయుడు, జనసేన పార్టీ నాయకులు దేవర మనోహర్, నాయకులు తపసి మురళి రెడ్డి, యువరాజ, హరి రాయల్, వాకా మురళి, కిషోర్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.



జయహో బీసీ సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాదరావు

పద్మావతి కాలేజీకి ప్రపంచ ఖ్యాతి

● 72వ వార్షికోత్సవంలో ఎస్వీయూ వీసీ శ్రీకాంత్ రెడ్డి


వార్షికోత్సవ సభలో మాట్లాడుతున్న వీసీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 12: మహిళలకు ఉన్నత విద్య అందించడంతో పాటు ఉన్నత విలువలు పాటిస్తున్న పద్మావతి కాలేజీకి అంతర్జాతీయ ఖ్యాతి ఉందని ఎస్వీయూ వీసీ శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. పద్మావతి డిగ్రీ కాలేజీ 72వ వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వీసీ మాట్లాడుతూ మహిళలను ఉన్నత విద్యావంతులు చేసిన ఘనత పద్మావతి కాలేజీకి దక్కుతుందన్నారు. ఈ కాలేజీలో చదువుకున్న విద్యార్థులు ప్రస్తుతం దేశ, విదేశాల్లో ప్రముఖ స్థానాల్లో ఉన్నారని తెలిపారు. కాలేజీ అభివృద్ధికి యూనివర్సిటీ తరఫున అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తామన్నారు. చదువుతో పాటు విద్యార్థులు క్రీడా, సాంస్కృతిక అంశాల పట్ల మక్కువ పెంచుకోవాలన్నారు. కాలేజీ అభివృద్ధికి టీటీడీ చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. టీటీడీ డీఈవో భాస్కరరెడ్డి మాట్లాడుతూ జేఈవో గౌతమి ఈ కాలేజీ పూర్వ విద్యార్థి అని గుర్తు చేశారు. టీటీడీ విద్యా సలహాదారు డాక్టర్ ఎల్ఆర్ మోహన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పద్మావతి కాలేజీ ఖ్యాతిని ఇనుమడింపజేసే విధంగా ఆసక్తి గల రంగంలో రాణించాలని సూచించారు. ప్రిన్సిపాల్ నారాయణమ్మ వార్షిక నివేదికను సమర్పించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రుయాలో చిన్నారికి అరుదైన వ్యాధి గుర్తింపు

● అజార్‌గా నిర్ధారించిన వైద్యులు


చిన్నారితో వైద్య సిబ్బంది

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 11 : రుయా ఆస్పత్రిలో ఓ చిన్నారికి అజార్(లేష్మేనియాసిస్) అనే వ్యాధి ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. జార్ఖండ్‌కు చెందిన వలస కూలీ కుమార్తె అయిన మనీషా(9) జ్వరంతో ఇబ్బంది పడుతుండడంతో రుయా చిన్నపిల్లల ఆస్పత్రిలో చేర్పించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ పేథాలజీ సహకారంతో పరీక్ష చేయగా అజార్ వ్యాధి ఉన్నట్టు నిర్ధారణ అయింది. చిన్నారికి వైద్యం చేసినట్లు చిన్నపిల్లల వార్డు విభాగాధిపతి మనోహర్ శుక్రవారం తెలిపారు. ఖరీదైన మందులను అందించడంతో పూర్తిగా నయం చేశామని చెప్పారు. లీష్మానియా డోనోవాని అనే పరాన్నజీవి సోకిన సాండ్‌ఫ్లై అనే కీటకం కాటు ద్వారా ఈ వ్యాధి సోకుతుందని, ప్రధానంగా బిహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య ఏజెన్సీకి నోటీసులు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 11: రుయా ఆస్పత్రి ఆవరణలోని టీబీ వార్డుకు సమీపంలో గురువారం జరిగిన అగ్నిప్రమాద ఘటనకు సంబంధించి పారిశుధ్య ఏజెన్సీకి రుయా అధికారులు శుక్రవారం నోటీసులు జారీ చేశారు. డంప్‌యార్డ్‌లో అధికంగా పోగైన వ్యర్థాలకు గుర్తు తెలియని వ్యక్తులు మంట పెట్టడంతో అగ్నిప్రమాదం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ప్రమాదాలు మళ్లీ జరగకుండా ఏరోజు చెత్తను ఆరోజే తొలగించాలని హెచ్చరిస్తూ ఏ-వన్ సర్వీసెస్ కాంట్రాక్ట్ సంస్థకు రుయా ఆస్పత్రి సూపరింటెండెంట్ రవిప్రభ, సీఎస్ఆర్ఎంవో లక్ష్మానాయక్ శుక్రవారం నోటీసులు జారీ చేశారు.

ఇంటర్ ఫలితాల్లో ప్రైవేట్ కళాశాలల హవా

తిరుపతి(విద్య), ఏప్రిల్ 12: ఏపీ ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన ఇంటర్ ఫలితాల్లో తిరుపతిలోని పలు ప్రైవేటు జూనియర్ కళాశాలల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి తమ హవా కొనసాగించారు.

శ్రీధర్స్ విద్యార్థుల జయకేతనం


విద్యార్థులతో ఛైర్మన్ శ్రీధర్

ఏఐఆర్ బైపాస్ రోడ్డులోని శ్రీధర్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి విజయ కేతనం ఎగురవేశారని ఛైర్మన్ మద్దినేని శ్రీధర్ పేర్కొన్నారు. ఫస్టియర్ ఎంపీసీలో తమ విద్యార్థులు నిఖిలేశ్వర్‌రెడ్డి 465, వన్షిక, యక్త, మంజుశ్రీ 464, పోషిత 463, మహ్మద్ ఇమ్రాన్ 462 పెన్నిధి, మహ్మద్ తాలిబ్ 460 మార్కులు సాధించారని, బైపీసీలో మేహనూర్ 433, తనుశ్రీ 426, రెడ్డినాగ గిరిధర్ 425, అమృత 420 మార్కులు సాధించినట్టు తెలిపారు. సీనియర్ ఎంపీసీ, బైపీసీలో జయ ఆదిత్య, వంశీకృష్ణారెడ్డి 983, చేతనశ్రీ, శాంతి 981, ధృతిప్రియ, హర్షవర్ధన్‌రెడ్డి, వెంకట గీతిక 979 మార్కులతో సత్తాచాటారని చెప్పారు. వీరిని ఛైర్మన్‌తోపాటు అధ్యాపకులు అభినందించారు.

విశ్వసాయి విజయకేతనం


విద్యార్థులతో ప్రిన్సిపాల్ జితేంద్ర

విశ్వసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు సత్ఫలితాలు సాధించి విజయకేతనం ఎగురవేశారని ప్రిన్సిపాల్ జితేంద్ర చెప్పారు. సీనియర్ బైపీసీలో భాషిత 990, షర్కానా 983, గాయత్రీదేవి 979, ప్రశాంత్ 976, ఎంపీసీలో రేష్మితారెడ్డి 980, అనూష 977, తనూశ్రీ 969, సిద్ధిసాయి ప్రవీణ్ 967, సౌజన్య 964, నేత్రానంద్ 961 సుజిత 960 సాధించినట్లు చెప్పారు. జూనియర్ ఎంపీసీలో నవీన, హర్షవర్ధన్ 462, మేఘనాదేవి, రికేష్ 461, గోవర్ధన్‌రెడ్డి, గ్రీష్మారెడ్డి 460, బైపీసీలో చేతన 426, మహ్మద్ ఉమా 420, సంజన 419, సీనియర్ ఎంఈసీలో విష్ణు 971, జూనియర్ ఎంఈసీలో రూప 473 మార్కులతో సత్తా చాటినట్టు చెప్పారు.

కృష్ణారెడ్డి చైతన్య విద్యార్థుల సత్తా



తిరుపతికి చెందిన కృష్ణారెడ్డి బీవీకే గ్రూప్ (డాక్టర్స్ మెడికల్, అమరావతి ఐఐటీ) విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి సత్తా చాటారని ఛైర్మన్ బీవీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. జూనియర్ బైపీసీలో శ్రీలక్ష్మి 434, కిరణ్మయి, హేమంతి 432, మహ్మద్ సాధిక్ 431, కావ్య 430, ఎంపీసీలో సాయినికిత, నందిని, భువనేశ్వరి, జాహ్నవి, లాస్య 464, సీనియర్ ఎంపీసీలో జయని 988, బైపీసీలో రోషిత 986 మార్కులతో సత్తా చాటారని వెల్లడించారు.

అశ్వమేధ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులతో డైరెక్టర్లు, అధ్యాపకులు

ఏఐఆర్ బైపాస్ రోడ్డులోని అశ్వమేధ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి ప్రతిభ చాటారని డైరెక్టర్లు అబ్దుల్ ఇషత్, టీఎం గోవర్ధన్ పేర్కొన్నారు. జూనియర్ బైపీసీలో వర్షశ్రీ 433, సారిక 432, వినీత, క్రితి 429, ఎంపీసీలో వైష్ణవి, వెంకట సాయి 462, నిఖిల్ 461, సాయి ప్రదీప్, పునీత్, యశస్వి 460, సీనియర్ బైపీసీలో సాయి ప్రీతి 986, యాళ్ల సుప్రీత్ 980, నియతి 979, పునీత్ అభిషిత్ 975, ఎంపీసీలో అనూష, సాయి స్నేహ 986, దీపక్ 972 మార్కులు సాధించినట్టు వెల్లడించారు. ప్రిన్సిపాళ్లు సుమతి, రామయ్య అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

ఎన్ఆర్ఐ విద్యార్థుల విజయభేరి


విద్యార్థులతో ఫైనాన్స్ డైరెక్టర్ భాస్కర్‌రావు, తిలక్‌బాబు.

న్యూ బాలాజీ కాలనీలోని ఎన్ఆర్ఐ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి విజయభేరి మోగించారని సీఈవో ప్రసాదరావు తెలిపారు. సీనియర్ ఎంపీసీ, బైపీసీల్లో సాయి శరత్‌చంద్ర 989, యశ్వంత్ 988, జూనియర్ ఎంపీసీలో నిఖిత 465, లాస్యశ్రీ 464, విమలశ్రీ 463, బైపీసీలో పూజిత 435 మార్కులు సాధించారన్నారు. విద్యార్థులను ఛైర్మన్ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఫైనాన్స్ డైరెక్టర్ భాస్కర్‌రావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిలక్‌బాబు అభినందించారు.

ఎమరాల్డ్స్ విద్యార్థుల విజయం



ఎల్ఐసీ రోడ్డులోని ఎమరాల్డ్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి విజయకేతనం ఎగురవేశారని అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్. మునిరత్నం పేర్కొన్నారు. సీనియర్ సీఈసీలో నిఖిల్ జైన్ 975, కుషీ 974, ఎంఈసీలో రాధిక 968, లిఖిత్ 967, ప్రణవ్ 961, జూనియర్ ఎంఈసీలో వాసు 489, రోహిత్ 487, బాలాజీ 486, రమ్య, యశ్వంత్, లక్ష్మీనారాయణ 482, ఎంపీసీలో వేల్‌మురుగన్ 458, గిరిశరణ్ 454, పూర్ణేష్ 453, సీఈసీలో గణేష్ 478, మనోజ్ 469, సంజయ్ ఆచారి 468, మయాంక్ 466 మార్కులతో ప్రతిభ చాటారని తెలిపారు. వీరిని డైరెక్టర్లు గిరిధర్, విశ్వనాథ్ అభినందించారు.

సీకాం విద్యార్థుల ప్రభంజనం



న్యూ మారుతీ నగర్‌లోని సీకాం జూనియర్ కళాశాల విద్యార్థులు మంచి మార్కులతో ప్రభంజనం సృష్టించారని ఛైర్మన్ డాక్టర్ టి.సురేంద్రనాథరెడ్డి పేర్కొన్నారు. సీనియర్ ఎంఈసీలో హర్షద్ పర్వేజ్ 974, ఎంపీసీలో పాహిమ 966, సీఈసీలో చైతన్య 940, బైపీసీలో ధరణి 920, జూనియర్ ఎంఈసీలో తక్షిల్ రెడ్డి 467, సీఈసీలో విజయ్‌కుమార్ 469, ఎంపీసీలో వర్ష 438 మార్కులు సాధించి ప్రతిభ చాటారని తెలిపారు. విద్యార్థులను డైరెక్టర్లు తేజస్వరూప్, ప్రణీత్‌స్వరూప్ అభినందించారు.

ఏటీఎన్ విద్యార్థుల ప్రతిభ





సరోజినీదేవి రోడ్డులోని ఏటీఎన్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారని కరస్పాండెంట్ మోహన్‌కృష్ణ పేర్కొన్నారు. సీనియర్ ఎంఈసీలో శ్రీరామ్ 966, సీఈసీలో హరిణిశ్రీ 961, లిఖిత 935, జూనియర్ ఎంపీసీలో స్రవంతి 452, సాయికృష్ణ 451, గోపిక తన్మయి 446, చాందిని 445 మార్కులు సాధించారని వెల్లడించారు. డైరెక్టర్లు నరేంద్రకుమార్, తిరుమలేశ్వర్ తదితరులు విద్యార్థులను అభినందించారు.

శ్రీగాయత్రి విద్యార్థుల విజయదుందుభి



తిరుపతికి చెందిన శ్రీగాయత్రి జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి విజయదుందుభి మోగించారని కరస్పాండెంట్ ఎ.నీరజాక్షులు పేర్కొన్నారు. సీనియర్ ఎంపీసీలో విష్ణువర్ధన్‌రెడ్డి 982, బైపీసీలో శాంతిప్రియ 979, జూనియర్ ఎంపీసీలో మునిలోకేష్ 460, బైపీసీలో అభినయ 419 మార్కులతో సత్తా చాటారని తెలిపారు. డైరెక్టర్ సి.కవిత, అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

శ్రీవేద విద్యార్థుల ప్రతిభ

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 12: ఇంటర్మీడియట్ ఫలితాల్లో పుత్తూరు పట్టణానికి చెందిన శ్రీవేద జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ఆ విద్యాసంస్థల ఛైర్మన్ బాలసరస్వతి తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో ఎస్.లహరి 987, వి.భానుతేజేష్ 989, పి.ఇస్మాయిల్ ఖాన్ 984 మార్కులు, బైపీసీలో ఆర్.యుమున 981 మార్కులు సాధించినట్లు వెల్లడించారు. అలాగే ప్రథమ సంవత్సరం ఎంపీసీలో టి.తులసి 466, ఆర్.సుజన్ 465, కే.రమశ్రీ 465, పి.లహరి 464 మార్కులు, బైపీసీలో ఎం.ప్రమీదాభాను 434, సి.కీర్తి 433, కే.సుప్రియ 433 మార్కులు సాధించినట్లు వివరించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను డైరెక్టర్లు సి.నారాయణబాబు, వేదవ్యాస్, ప్రిన్సిపాళ్లు వి.సనత్‌కుమార్, ఎస్.ఖాజాపీర్ అభినందించారు.


ఆర్.యుమున - ఎస్.లహరి - వి.భానుతేజేష్ - పి.ఇస్మాయిల్ ఖాన్

ఎస్వీడీఏ విద్యార్థుల ప్రతిభ

తిరుపతి(విద్య), ఏప్రిల్ 12: తిరుపతి రూరల్ మండలం వేదాంతపురంలోని ఎస్వీడీఏ జూనియర్ కళాశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి ప్రతిభ చాటారని ఛైర్మన్ శేషారెడ్డి పేర్కొన్నారు. జూనియర్ ఎంపీసీలో రెడ్డివర్ధన్ 462, గౌతం 461, జ్యోతిలాస్య, సంతోష్ 460, బైపీసీలో ఢమరస్ 433, జశ్విక 424, జాతస్య 421 మార్కులు సాధించి సత్తా చాటారని వెల్లడించారు. విద్యార్థులను డైరెక్టర్ సందీప్, అధ్యాపకులు అభినందించారు.

రేపు అంబేడ్కర్ జయంతి సభ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 12: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 133వ జయంతి సభను ఎస్వీయూలో ఆదివారం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు సెనేట్ హాల్లో ప్రారంభం కానున్న ఈ కార్యక్రమానికి వీసీ శ్రీకాంత్ రెడ్డి, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ ఛైర్మన్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, రిజిస్ట్రార్ హుస్సేన్, నిర్వాహకులు కిషోర్, బాలాజీ హాజరు కానున్నట్లు వర్సిటీ మీడియా కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఆర్యవైశ్యుల ఓటింగ్ శాతం పెంచుతాం


కరపత్రాన్ని విడుదల చేస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 12: ఆర్యవైశ్యుల ఓటింగ్ శాతం పెంచేందుకు కృషి చేస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు దిండుకుర్తి నరసింహులు తెలిపారు. శుక్రవారం తిరుపతి ఆర్యవైశ్య సంఘం కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆర్యవైశ్యులు ఓటు వేయడానికి రారనే అపవాదును తొలగించడానికి ప్రయత్నిస్తామన్నారు. తిరుపతి నియోజకవర్గ పరిధిలోని ఆర్యవైశ్య ఓటర్లను చైతన్యపరిచే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. మే 13న ఎన్ని పనులున్నా ఓటు వేయడానికి ముందుకురావాలని పిలుపునిచ్చారు. ఓటింగ్ శాతం పెరిగితే సంఘానికి మంచి గుర్తింపు లభిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి హేమచంద్ర, సభ్యులు పాల్గొన్నారు.

ఏపీపీజీఈ సెట్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 12: ఏపీ ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో ఎస్వీయూ ఏపీపీజీఈ సెట్-2024 ప్రవేశ పరీక్షలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కన్వీనర్ ప్రొఫెసర్ టి.రమ్యశ్రీ తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడుతూ ఎంటెక్, ఎంఫార్మసీ, ఫార్మాడీ కోర్సుల ప్రవేశాలకు సంబంధించిన ఈ పరీక్షకు ఈనెల 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. మే 12వ తేదీ వరకు అపరాధ రుసుంతో దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. ప్రవేశ రుసుం ఓసీలకు రూ.1,200, బీసీలకు రూ.900, ఎస్సీ, ఎస్టీలకు రూ.700గా నిర్ణయించినట్లు వెల్లడించారు. మే 29, 30, 31 తేదీల్లో 13 సబ్జెక్టులకు పరీక్షలు ఉంటాయని తెలిపారు. ఇతర వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు.

22లోపు ఫారం 12డి సమర్పించండి

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 12: ఎన్నికల విధులు కేటాయించిన, అత్యవసర సర్వీసు శాఖల అధికారులు తమ నియోజకవర్గంలో ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉంటుందని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో అత్యవసర సర్వీసు శాఖల అధికారులు, సిబ్బంది ఫారం 12డిని ఈ నెల 22లోపు ఆర్వో కార్యాలయానికి సమర్పించాలన్నారు. నిబంధనల ప్రకారం నిర్దేశించిన ఓటరు ఫెసిలిటీ సెంటర్‌లో ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంటుందన్నారు. పోలీసు శాఖకు సంబంధించి ఫారం 12డి ద్వారా పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పోలింగ్ విధులు కేటాయించిన ప్రతి ఒక్కరూ విధులకు హాజరు కావాలని సూచించారు.

ఈవీఎం ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

- ఈవీఎం తరలించే వాహనాలకు జీపీఎం సిస్టమ్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 12: మొదటి విడత ఈవీఎం, వీవీ ప్యాట్స్ ర్యాండమైజేషన్ ప్రక్రియ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పూర్తి చేసినట్లు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం రాజకీయ పార్టీల నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు తిరుపతి పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించిన కంట్రోల్ యూనిట్స్, బ్యాలెట్ యూనిట్స్, వీవీ ప్యాట్‌ల ర్యాండమైజేషన్ ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్‌లో ఆన్‌లైన్ ద్వారా చేపట్టి పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈవీఎం, వీవీ ప్యాట్స్ యంత్రాలు తరలించే వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ ఉంటుందని సెక్యూరిటీ ప్రోటోకాల్ ప్రకారం పటిష్ఠ పోలీసు బందోబస్తుతో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు ఈవీఎం, వీవీ ప్యాట్స్ యంత్రాలను పంపిస్తామన్నారు.డీఆర్వో కిషోర్, ఈఆర్వోలు అదితిసింగ్, నిషాంత్‌రెడ్డి, చంద్రముని కిరణ్‌కుమార్, రామ్మోహన్, నరసింహులు, టీడీపీ నుంచి మనోహరాచారి, వైసీపీ నుంచి చంద్రశేఖర రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నుంచి రవి, అమ్‌ఆద్మీ పార్టీ ప్రతినిధి నగేష్ తదితరులు హాజరయ్యారు.

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 12: జిల్లాలో వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి.వెంకటగిరిలో 108మంది,శ్రీకాళహస్తిలో 65మంది, గూడూరులో 60మంది, సూళ్ళూరుపేటలో 48మంది, తిరుపతి అర్బన్‌లో 34మంది, చంద్రగిరిలో 21మంది రాజీనామా చేశారు.జిల్లాలో వాలంటీర్ల రాజీనామాల సంఖ్య 354మందికి చేరిందని అధికారులు తెలిపారు. కొన్ని చోట్ల వైసీపీ నేతలు వలంటీర్లను తమ కార్యాలయాలకు పిలిపించుకుని బెదిరించి మరీ రాజీనామాలు చేయిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

ముక్కంటి సేవలో జపాన్ భక్తులు



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 13: ముక్కంటి ఆలయాన్ని శుక్రవారం 16 మంది జపాన్ దేశస్తులు దర్శించుకున్నారు. జపాన్ దేశస్తులు భారతీయ సంప్రదాయ వస్త్రధారణలో ఆలయానికి విచ్చేశారు. స్వామి అమ్మవార్లను దర్శించుకుని ఉంజల్ సేవ మండపం వద్ద భక్తి తన్మయత్వంతో శివనామ స్మరణ చేశారు. ఆలయ శిల్ప సౌందర్యాన్ని చూసి మంత్రముగ్ధులయ్యారు. ఆలయం వెలుపల సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేశారు.

ఘనంగా శుక్రవార ఉత్సవం



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 12: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం పురస్కరించుకుని అమ్మవారికి విశేష ఉత్సవం నిర్వహించారు. అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబిక అమ్మవారి ఉత్సవ మూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయంలో ప్రాకారంగా ప్రదక్షిణ చేసి తిరిగి కొలువుదీర్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తడ, ఏప్రిల్ 12: 220-132 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి, సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం, బాలాయపల్లి, డక్కిలి, వెంకటగిరి మండలాల్లో శనివారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రసన్నకుమార్ తెలిపారు.

గూడూరు అర్బన్: పట్టణంలోని 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆశాఖ డీఈ ప్రసాద్ శుక్రవారం తెలిపారు.

జనారణ్యంలోకి చుక్కల దుప్పి

సూళ్లూరుపేట, ఏప్రిల్ 12: సూళ్లూరుపేటలో షార్ ఉద్యోగులు నివాసం ఉండే డీఆర్‌డీఎల్ కాలనీలో శుక్రవారం ఓ చుక్కల దుప్పి తిరుగుతుండటాన్ని స్థానికులు గమనించి ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. డీఆర్‌డీఎల్ కాలనీ జనరల్ సెక్రటరీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఫారెస్ట్, ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకొని జింకను పట్టుకొని షార్ అడవుల్లో వదిలిపెట్టారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి జగదీష్, ఫారెస్ట్ అధికారి నరసింహారావు, సూర్యతేజ తదితరులు పాల్గొన్నారు.



పెరిమిటిపాడు వద్ద అటవీ భూముల్లో గ్రావెల్ తవ్వకాలు - మట్టి తవ్వడంతో ఏర్పడిన గోతులు - మంగళంపాడు సమీప పొలాల్లో ఇసుక డంపింగ్

అడ్డుకునేవారెవరు?

- నిత్యం గ్రావెల్ తవ్వకాలు
- యథేచ్ఛగా అక్రమ రవాణా
- పట్టించుకోని అధికారులు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 12: అడిగే వారూ లేరు... అడ్డుకునేవారు లేరూ అన్నట్లు ఇసుక, మట్టి మాఫియా రెచ్చిపోతోంది. చెరువులు, ప్రభుత్వ, అటవీ భూములన్న తేడా లేకుండా గ్రావెల్‌ను తవ్వేస్తున్నారు. కాళంగి నది నుంచి ఇసుకను అక్రమ రవాణా సాగిస్తున్నారు. రేయింబవళ్లు అంటూ అక్రమ రవాణా సాగుతోంది. ఎన్నికలు కోడ్ అమల్లో ఉన్నా అధికార పార్టీ నాయకుల అక్రమ రవాణాకు అధికారులు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. సూళ్లూరుపేట పట్టణంతో పాటు, తడ తదితర ప్రాంతాల్లో వెలసిన వెంచర్లకు మట్టిని తరలించి లక్షలాది రూపాయలు వెనకేసుకుంటున్నారు. సూళ్లూరుపేట మండలం పెరిమిటిపాడు చెరువు, పక్కనే ఉన్న భూముల్లో ఎక్స్‌కవేటర్ల సాయంతో మట్టి, గ్రావెల్‌ను తవ్వి వెంచర్లకు తరలిస్తున్నారు. ఇదంతా అధికారుల కనుసన్నల్లోనే జరుగుతోందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. పరిసరాల్లో ఉన్న అటవీ భూముల్లో సైతం గ్రావెల్‌ను తవ్వేస్తున్నారు. ఫారెస్టు అధికారులు సైతం పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. అదేవిధంగా కాళంగి నది నుంచి రోజూ ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. ఇలుపూరు, మంగళంపాడు, వెంగలాపురం ప్రాంతాల నుంచి కాళంగి నదిలో ఇసుక తవ్వి సమీప పొలాల్లో, గ్రామాల్లో డంపింగ్ చేసుకొని పరిశ్రమలకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు. పెరిమిటిపాడు చెరువు, పక్కనే అటవీ భూముల్లో యంత్రాలు పెట్టి గ్రావెల్‌ను పట్టపగలే తవ్వుతున్న రెవెన్యూ, మైనింగ్, ఎస్ఈబీ, అటవీశాఖ అధికారులు పట్టించుకోవడంలేదు. అధికారులు మామూళ్లు తీసుకొని అక్రమ రవాణాకు సహకరిస్తున్నారని స్థానిక గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రావెల్, ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

చంద్రబాబుతోనే స్థిరమైన అభివృద్ధి, సంక్షేమం: పరసారత్నం



శ్రీదరమల్లిలో మాట్లాడుతున్న మాజీమంత్రి పరసా రత్నం

దొరవారిసత్రం, ఏప్రిల్ 12: చంద్రబాబు నాయుడుతోనే స్థిరమైన అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి పరసా రత్నం పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని శ్రీదరమల్లిలో సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీతో కలసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పరసారత్నం మాట్లాడుతూ సీఎం జగన్ అప్పులు చేస్తూ సంక్షేమం పేరిట ఉత్తుతి బటన్‌లను నొక్కుతూ ప్రజలను మభ్యపెడుతున్నారని అన్నారు. మద్యం నిషేధం అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి నాసిరకం బ్రాండ్లు విక్రయిస్తూ వేలాది కోట్లు దోచుకుంటూ పేదల ఉసురుతీస్తున్నారని ఆరోపించారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు రాష్ట్రంలో సంపద సృష్టించి, స్థిరమైన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతారని అన్నారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తే శాంతిభద్రతలతో పాటు అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీ, తిరుపతి పార్లమెంటు బీజేపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేమసాని శ్రీనివాసులునాయుడు, చింతల సతీష్‌చంద్ర, ఎన్ఆర్ఐ వెంకట్‌గుప్తా బృందం, మనోహర్‌రెడ్డి, పురుషోత్తంయాదవ్, సుధాకర్, ప్రసాద్‌నాయుడు, చంద్రయ్యనాయుడు, సుబ్రహ్మణ్యం, నాగేంద్రనాయుడు, సుజాత, ప్రమీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆరుద్ర ఉత్సవం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 12: ముక్కంటి ఆలయంలో ఆదివారం ఆరుద్రోత్సవం నిర్వహించ నున్నట్లు ఈవో నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరమ శివుని జన్మ నక్షత్రమైన ఆరుద్ర విశేషాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఉదయం 8:30 గంటల సమయంలో అలంకార మండపంలో విశేషంగా అలంక రించిన స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అక్కడ నుంచి స్వామి అమ్మవార్లు ఊరేగింపుగా బయలుదేరి ఊరందూరు గ్రామంలో వెలసిన నీలకంఠేశ్వర స్వామి సన్నిధికి చేరుకుని కొలువుదీరుతారని తెలియజేశారు. అక్కడ విశేష అభిషేకాలు, ధూపదీప నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మధ్యాహ్నం మూడు గంటలకు ఊరందూరు నుంచి స్వామి అమ్మవార్లు తిరిగి పట్టణానికి విచ్చేస్తారని పేర్కొన్నారు. ఆ తర్వాత చతుర్మాడా వీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమిస్తారని తెలియజేశారు. చివరగా స్వామివార్లు ఆలయంలోకి చేరడంతో ఆరుద్ర ఉత్సవం ముగుస్తుందని వివరించారు.

దక్షిణ కాళికాదేవికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 12: శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామంలో వెలసిన దక్షిణ కాళికాదేవికి శుక్రవారం పురస్కరించకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం రాహుకాలం సమయంలో అర్చకులు అమ్మవారి మూల మూర్తిని పూజా ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం నిమ్మకాయలు, పూల మాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. శ్రీకాళహస్తితో పాటు పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు దీపాలు వెలిగించి హారతులు పట్టారు. ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అంతకు ముందు మధ్యాహ్నం దాతలు ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు.

కనకదుర్గమ్మకు విశేష పూజలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 5: ముక్కంటి ఆలయానికి అనుబంధంగా కనికాచలంపై వెలసిన కనక దుర్గమ్మకు శుక్రవారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాహుకాలం సమ యంలో అమ్మవారి మూల మూర్తికి వివిధ పూజా ద్రవ్యాలతో విశేషంగా అభిషేకాలు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారికి దీపారాధన సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే సామూహిక లలితా సహస్ర నామం పఠించారు. అనంతరం అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శన మిచ్చారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మద్య నిషేధంపై జగన్ మడమ తిప్పేశారు: విజయశ్రీ

సూళ్లూరుపేట, ఏప్రిల్ 12: అధికారంలోకి రాగానే మద్య నిషేధం, సీపీఎస్ రద్దు చేస్తామని చెప్పిన జగన్ అధికారంలోకి రాగానే మడమ తిప్పేశారని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నెలవల విజయశ్రీ విమర్శించారు. శుక్రవారం మండల పరిధిలోని కేసియన్ గుంట, కుదిరి, చెరువు కండ్రిగ, తిప్పకండ్రిగ గ్రామాల్లో మాజీ మంత్రి పరసా వెంకటరత్నం, టీడీపీ జిల్లా అధికారి ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డితో కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగన్ నాశిరకం బ్రాండ్‌లను విక్రయిస్తూ పేదల ఉరుసు తీస్తున్నారని విమర్శించారు.

టీడీతోనే గ్రామాల్లో మౌలిక సౌకర్యాల కల్పన



ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 12: గ్రామాల్లో మౌలిక సౌకర్యాల కల్పన టీడీతోనే సాధ్యమని ఆ పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి, మాజీ ఎంపీపీ గంజి మాధవయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రామసముద్రం పంచాయతీ ఆది ఆంధ్రవాడలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి పనులే తప్ప ఈ ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాల్లో జరిగిన అభివృద్ధి అంతంత మాత్రమేనని తేల్చిచెప్పారు. అభివృద్ధి, సంక్షేమం రెండూ చంద్రబాబునాయుడు అధికారంలోకి వస్తేనే సాధ్యమవుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్‌ను, ఎంపీ అభ్యర్థిగా డి.ప్రసాద్‌రావును గెలిపించుకుందామని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కోటి, శంకర్, లోకేష్, సాయి, శ్రీరాములు, వెంకటేష్, రామ్మూర్తి, ఢిల్లీబాబు, జగదీష్, రవి, నరేంద్ర, ఫల్గుణి, వెంకటాద్రి, మాజీ మండల అధ్యక్షుడు కరుణాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రన్నతోనే రాష్టాభివృద్ధి: ఆదిమూలం



ఇంటింటి ప్రచారంలో ఆదిమూలం

నారాయణవనం, ఏప్రిల్ 12: రాష్టాభివృద్ధి చంద్రన్నతోనే సాధ్యమని సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలం పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధివకాశాలు రావాలంటే చంద్రన్న సీఎం కావాలని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం ఎస్టీ, ఎస్సీలపై దాడులు, దౌర్జన్యాలు ఎక్కువయ్యాయని, దళిత హక్కులను కాలరాసే వైసీపీని ఇంటికి పంపించాలని కోరారు. ఈ సందర్భంగా కొందరు వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. వారికి ఆదిమూలం పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సుమన్‌కుమార్, నాయకులు భాస్కరన్, గోవిందస్వామి, పరుశురామయ్య, మాణిక్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీల అభ్యున్నతే టీడీపీ ధ్యేయం



లక్ష్మమ్మ కండ్రగలో కరపత్రం అందిస్తున్న నాయకులు

వడమాలపేట, ఏప్రిల్ 12: బీసీల అభ్యున్నతే టీడీపీ ధ్యేయమని తెలుగు యువత నాయకులు ఉదయ్ యాదవ్ చెప్పారు. శుక్రవారం మండలంలోని లక్ష్మమ్మకండ్రిగ పంచాయతీ పరిధిలో ప్రచారం నిర్వహించారు. టీడీపీని గెలపించాలని కోరుతూ కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో భాస్కర్ నాయుడు, ధనంజయులు నాయుడు, జానా వెంకటయ్య, లక్ష్మీప్రసన్న హేమావతి, రామస్వామి, వెంకటముని, నాగభూషణం యాదవ్, సుబ్రహ్మణ్యం నాయుడు, ధనంజయ యాదవ్, చంద్రయ్య, బాబు, విద్యాసాగర్, మురళి, అయ్యప్ప, కమలనాద్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి



వెంకటేష్ (ఫైల్‌ఫొటో)

నారాయణవనం, ఏప్రిల్ 12: రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి చెందిన సంఘటన శుక్రవారం పుత్తూరు - ఊత్తుకోట జాతీయ రహదారిలో జరిగింది. ఎస్ఐ లక్ష్మీనారాయణ కథనం మేరకు... మండలంలోని జంగాలపల్లి గ్రామానికి చెందిన వెంకటేష్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గురువారం రాత్రి పుత్తూరు నుంచి తన ఆటోలో తిరిగి వస్తుండగా ఎదురుగా వస్తున్న తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న వెంకటేష్ తీవ్రంగా గాయపడడంతో పుత్తూరు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆటో డ్రైవర్ కుటుంబంపై దాడి

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 12: పట్టణానికి చెందిన ఆటో డ్రైవర్ కుటుంబంపై మద్యం మత్తులో కొందరు యువకులు దాడికి పాల్పడిన సంఘటన పుత్తూరులో చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.... పట్టణానికి చెందిన ఆటో డ్రైవర్ ఖాసింబాయ్ శుక్రవారం ఆటవిడుపు కోసం మండల పరిధిలోని మూలకోనకు కుటుంబంతో కలిసి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో భాగంగా రోడ్డుకు అడ్డంగా నిలిపి ఉన్న ఆటోలను తొలగించమని కోరాడు. అక్కడ మద్యం మత్తులో ఉన్న సుమారు 20మంది శ్రీకాళహస్తికి చెందిన యువకులు ఖాసింబాయ్‌తో వాగ్వాదానికి దిగి విచక్షణారహితంగా దాడి చేశారు. అడ్డువచ్చిన భార్య, కోడలిపై కూడా దాడి చేశారు. గాయాలపాలైన ఖాసింభాయ్ తన సహచర ఆటోడ్రైవర్లు, కుమారుల ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. దాడికి పాల్పడిన యువకుల్లో కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు ఖాసింభాయ్ తెలిపారు.

టీడీపీలో చేరిన యువత

వడమాలపేట, ఏప్రిల్ 2: మండలంలోని ఎస్‌బీఆర్ పురం దళితవాడ, అంబేడ్కర్ కాలనీలకు చెందిన యువత శుక్రవారం టీడీపీలో చేరారు. వారికి నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ పార్టీ కండవాలు కప్పి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో చంద్ర, శ్రీనివాసులు, బాలాజీ, ప్రభాకర్, మాధవ, బాలసుబ్రహ్మణ్యం, ఉదయ్, వంశీ, అల్లిబాబు, శివ, విద్యాసాగర్, జయరామయ్య, కుమార్, వినోద్ కుమార్, గురేంద్ర ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెద్దబ్బరాజు, సుబ్రహ్మణ్యం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 12: మున్సిపాలిటీ పరిధిలోని పల్లూరు, దాసరిగుంట, గోవిందపాళ్యం, సత్యనారాయణకాలనీ, లక్ష్మీనగర్ కాలనీలకు చెందిన 32 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్ పెంచలయ్యకు రాజీనామా పత్రాలను అందించారు. వైసీపీ తరఫున ప్రచారం నిర్వహించేందుకు ఎన్నికల షెడ్యూల్ వలంటీర్లకు అడ్డుగా మారింది. నిబంధనలు అతిక్రమించి వైసీపీ ప్రచారాల్లో పాల్గొన్న వలంటీర్లు ఇటీవల కొందరు సస్పెన్షన్‌కు గురయ్యారు. దీంతో పాటు స్థానిక వైసీపీ నాయకులను నుంచి కూడా వత్తిడి పెరగడంతో రాజీనామాలకు సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతోంది.

వైసీపీ ఓటమి ఖరారైంది: గాలి భానుప్రకాష్

నగరి, ఏప్రిల్ 12: రాష్ట్రంలో కూటమి పవనాలు వీస్తున్నాయని, వైసీపీ ఓటమి ఖరారైందని నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ స్పష్టం చేశారు. నగరి పట్టణ పరిధిలోని సత్రవాడలో యూనిట్ ఇన్‌చార్జి కరుణ ఆధ్వర్యంలో శుక్రవారం సూపర్‌సిక్స్ కరపత్రాలు పంచుతూ ఇంటింటి ప్రచారం చేశారు. భానుప్రకాష్ మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే మరమగ్గ కార్మికులను ఆదుకుంటామని, విద్యుత్ చార్జీలు తగ్గించడమే గాక 500 యూనిట్లు ఉచితంగా ఇస్తామన్నారు. నగరి టీడీపీ కార్యదర్శి శ్రీనివాసన్, జ్ఞానశేఖర్, గోపిరెడ్డి, రవిచంద్రన్, పులగనాథన్, కదిరివేలు, అరవింద్, పొన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీనుంచి టీడీపీలో పలువురి చేరిక

నగరి మండల పరిధిలోని వీకేఆర్‌పురం గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు శుక్రవారం ఉదయం తిరుపతిలోని భానుప్రకాష్ ఇంటి వద్ద టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరిలో.. వీకేఆర్‌పురానికి చెందిన జగన్, హరికృష్ణ, సురేంద్ర, గోవిందమండడి, మనోజ్ ప్రవీణ్‌కుమార్ కిరణ్‌కుమార్, మౌలీచంద్రన్, మురళిబాబుతోపాటు మరో 15 మంది యువత ఉన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి పురుషోత్తంనాయుడు, సీనియర్ నాయకులు సురేష్‌నాయుడు, మధునాయుడు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



సత్రవాడలో ఇంటింట ప్రచారం చేస్తున్న భానుప్రకాష్

ఇంటర్ ఫలితాల్లో శ్రీవేద విద్యార్థుల ప్రతిభ



ఆర్.యుమున - ఎస్.లహరి - వి.భానుతేజేష్ - పి.ఇస్మాయిల్ ఖాన్

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 12: ఇంటర్మీడియట్ ఫలితాల్లో పుత్తూరు పట్టణానికి చెందిన శ్రీవేద జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ఆ విద్యాసంస్థల ఛైర్మన్ బాలసరస్వతి తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో ఎస్.లహరి 987, వి.భానుతేజేష్ 989, పి.ఇస్మాయిల్ ఖాన్ 984 మార్కులు, బైపీసీలో ఆర్.యుమున 981 మార్కులు సాధించినట్లు వెల్లడించారు. అలాగే ప్రథమ సంవత్సరం ఎంపీసీలో టి.తులసి 466, ఆర్.సుజన్ 465, కే.రమశ్రీ 465, పి.లహరి 464 మార్కులు, బైపీసీలో ఎం.ప్రమీదాభాను 434, సి.కీర్తి 433, కే.సుప్రియ 433 మార్కులు సాధించినట్లు వివరించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను డైరెక్టర్లు సి.నారాయణబాబు, వేదవ్యాస్, ప్రిన్సిపాళ్లు వి.సనత్‌కుమార్, ఎస్.ఖాజాపీర్ అభినందించారు.



కృష్ణారెడ్డి చైతన్య విద్యార్థుల సత్తా

తిరుపతి(విద్య), ఏప్రిల్ 12: ఇంటర్ ఫలితాల్లో తిరుపతికి చెందిన కృష్ణారెడ్డి బీవీకే గ్రూప్(డాక్టర్స్ మెడికల్, అమరావతి ఐఐటీ) విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి సత్తా చాటారని ఛైర్మన్ బీవీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. జూనియర్ బైపీసీలో శ్రీలక్ష్మి 434, కిరణ్‌మయి, హేమంతి 432, మహ్మద్ సాధిక్ 431, కావ్య 430, ఎంపీసీలో సాయినికిత, నందిని, భువనేశ్వరి, జాహ్నవి, లాస్య 464, సీనియర్ ఎంపీసీలో జయని 988, బైపీసీలో రోషిత 986 మార్కులతో సత్తా చాటారని వెల్లడించారు.

విశ్రాంత మందిరాన్ని తెరవాలని నిరసన

పుత్తూరు, ఏప్రిల్ 12: పుత్తూరు మండల రెవెన్యూ కార్యాలయానికి వచ్చే వృద్ధుల కోసం తుడ నిధులతో నిర్మించిన విశ్రాంత మందిరాన్ని మూసి వేయడంతో శుక్రవారం అర్జీదారులు నిరసన తెలిపారు. ఇటీవల పురపాలక భవనం దారి కోసం పాత రెవెన్యూ కార్యాలయ భవనాన్ని కూల్చివేయడంతో బయటపడిన పాత దుంగలను విశ్రాంత మందిరంలో భద్రపరిచి తాళాలు వేశారు. దీంతో రెవెన్యూ కార్యాలయంలో పనుల కోసం వచ్చిన అర్జీదారులు కూర్చునేందుకు నీడలేక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో సీపీఎం నాయకుడు వెంకటేశ్, ఎస్సీ సంఘ నాయకులు గంగాధరం అర్జీదారులతో కలిసి నిరసన తెలిపారు. ఈ విషయమై తహసీల్దారు వెంకటేశం గౌడ్ విచారించగా మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని చెప్పారు.

శ్రీధర్స్ విద్యార్థుల జయకేతనం



విద్యార్థులతో ఛైర్మన్ శ్రీధర్

తిరుపతి(విద్య), ఏప్రిల్ 12: ఇంటర్ ఫలితాల్లో తిరుపతి ఏఆర్ బైపాస్ రోడ్డులోని శ్రీధర్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి విజయ కేతనం ఎగురవేశారని ఛైర్మన్ మద్దినేని శ్రీధర్ పేర్కొన్నారు. ఫస్టియర్ ఎంపీసీలో తమ విద్యార్థులు నిఖిలేశ్వర్‌రెడ్డి 465, వన్షిక, యక్ష, మంజుశ్రీ 464, పోషిత 463, మహ్మద్ ఇమ్రాన్ 462 పెన్నిధి, మహ్మద్ తాలిబ్ 460 మార్కులు సాధించారని, బైపీసీలో మేహనూర్ 433, తనుశ్రీ 426, రెడ్డినాగ గిరిధర్ 425, అమృత 420 మార్కులు సాధించినట్లు తెలిపారు. సీనియర్ ఎంపీసీ, బైపీసీలో జయ ఆదిత్య, వంశీకృష్ణారెడ్డి 983, చేతనశ్రీ, శాంతి 981, ధృతిప్రియ, హర్షవర్ధన్‌రెడ్డి, వెంకట గీతిక 979 మార్కులతో సత్తాచాటారని చెప్పారు. వీరిని ఛైర్మన్‌తోపాటు అధ్యాపకులు అభినందించారు.

విశ్వసాయి విజయకేతనం



విశ్వసాయి విద్యార్థులతో ప్రిన్సిపల్ జితేంద్ర

తిరుపతి(విద్య), ఏప్రిల్ 12: ఇంటర్ ఫలితాల్లో తిరుపతికి చెందిన విశ్వసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి విజయకేతనం ఎగురవేశారని ప్రిన్సిపాల్ జితేంద్ర చెప్పారు. సీనియర్ బైపీసీలో భాషిత 990, షర్మానా 983, గాయత్రీదేవి 979, ప్రశాంత్ 976, ఎంపీసీలో రేష్మితారెడ్డి 980, అనూష 977, తనుశ్రీ 969, సిద్ధిసాయి ప్రవీణ్ 967, సౌజన్య 964, నేత్రానంద్ 961 సుజిత 960 సాధించినట్లు చెప్పారు. జూనియర్ ఎంపీసీలో నవీన, హర్షవర్ధన్ 462, మేఘనాదేవి, రికేష్ 461, గోవర్ధన్‌రెడ్డి, గ్రీష్మారెడ్డి 460, బైపీసీలో చేతన 426, మహ్మద్ ఉమా 420, సంజన 419, సీనియర్ ఎంఈసీలో విష్ణు 971, జూనియర్ ఎంఈసీలో రూప 473 మార్కులతో సత్తా చాటినట్లు చెప్పారు.

పవన్ కల్యాణ్‌కు ఘనస్వాగతం



రేణిగుంట, ఏప్రిల్ 12: జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు రేణిగుంట విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. శుక్రవారం రాత్రి ప్రత్యేక విమానంలో విజయవాడ నుంచి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, జనసేన నాయకులు పసుపులేటి హరిప్రసాద్, రాజారెడ్డి, ఎస్వీప్రసాద్, టీడీపీ నాయకులు సుగుణమ్మ, కృష్ణయాదవ్, బీజేపీ నాయకులు కోలా ఆనంద్ స్వాగతం పలికారు. పవన్ కల్యాణ్ వస్తున్నారని సమాచారం అందుకున్న అభిమానులు భారీ ఎత్తున విమానాశ్రయానికి చేరుకుని స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన తిరుపతికి బయలుదేరి వెళ్లారు.

ఆంగ్లభాషపై పట్టు కోసమే టోఫెల్

తొట్టంబేడు, ఏప్రిల్ 12: ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు ఆంగ్లభాషపై పట్టుసాధించడం కోసమే టోఫెల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎంఈవో భువనేశ్వరి అన్నారు. శ్రీకాళహస్తి మండలంలోని ఊరందూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఇంటర్నేషనల్ టెస్టింగ్ సర్వీసెస్ (ఈటీఎస్) నిర్వహించే టోఫెల్ ప్రాథమిక స్థాయి పరీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రాజకుమారి, ఉపాధ్యాయులు వరలక్ష్మి, కూనాటి సురేష్, రమేష్‌రెడ్డి, మురళి, శ్రీనివాసులు, రజియా, శారద పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

తొట్టంబేడు, ఏప్రిల్ 12: కల్లిపూడి గ్రామం వద్ద ప్రవహిస్తున్న తెలుగుగంగ కాలువలో తేలియాడుతున్న గుర్తుతెలియని మృతదేహం శుక్రవారం లభ్యమైంది. తొట్టంబేడు ఎస్ఐ రామచంద్ర గ్రామస్థులు, సిబ్బంది సాయంతో మృతదేహాన్ని వెలికి తీయించారు. అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేశారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరికలు

తొట్టంబేడు, ఏప్రిల్ 12: శ్రీకాళహస్తి మండలంలోని గొల్లపల్లి గ్రామంలో మాజీ ఎంపీపీ తాటిపర్తి ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు సుందరరామిరెడ్డి, సుబ్బరాయులు వారితోపాటు గ్రామంలోని పది కుటుంబాల వారు శుక్రవారం టీడీపీలో చేరారు. వారికి తాటిపర్తి ఈశ్వర్‌రెడ్డి పసుపు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెంచయ్య నాయుడు, తాటిపర్తి రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు రాజీనామా చేయాలని వైసీపీ ఒత్తిళ్లు

రేణిగుంట, ఏప్రిల్ 12: రేణిగుంటలో పనిచేస్తున్న వలంటీర్లను రాజీనామా చేయాలని వైసీపీ ప్రజాప్రతినిధులు ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. రాజీనామా చేసి ఆదివారం జరగబోయే గ్రామసభకు రావాలని చెబుతున్నారు. 'అలాగే రూ.15వేలు డబ్బులిస్తాం రెండు నెలలు ఖర్చుకు పెట్టుకోండి' అని అంటున్నారని తెలిసింది. ఎన్నికల తరువాత మీ ఉద్యోగాలు మీకే ఇస్తామంటున్నారని వలంటీర్లు చెబుతున్నారు. కాగా శుక్రవారం గురవరాజుపల్లి పంచాయతీ చెందిన పదిమంది వలంటీర్లు రాజీనామా చేశారు.

శ్రీకాళహస్తిని బీసీ కేటగిరిలో చేర్చాలి

రేణిగుంట, ఏప్రిల్ 12: శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని బీసీ కేటగిరి లో చేర్చాలని భారత చైతన్య యోజన పార్టీ శ్రీకాళహస్తి ఎమ్మెల్యే అభ్యర్థి దీన బాబు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీవై మేనిఫెస్టోను వివరించారు. నియోజకవర్గంలో 85శాతం బీసీలు ఉన్నారని ఈ విషయాన్ని గుర్తించి భవిష్యత్తులో శ్రీకాళహస్తిని బీసీ కేటగిరిగా చేయాలన్నారు. అనంతరం నియోజకవర్గ బీసీవై మండల అధ్యక్షులను ప్రకటించారు. ఇందులో శ్రీకాళహస్తికి రాజయాదవ్, తొట్టంబేడుకు సునీల్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ బాలకృష్ణ, దిలీప్‌రెడ్డి, గోపాల్‌నాయుడు ఉన్నారు.

అనారోగ్యంతో వెలుగు ఉద్యోగిని మృతి

సత్యవేడు, ఏప్రిల్ 12: సత్యవేడు వెలుగు కార్యాలయంలో అకౌంటెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న నందిని(32) గురువారం రాత్రి మృతి చెందారు. ఆమె మృతిపట్ల ఏపీఎం నిర్మలత, కోఆర్డినేటర్ పయని, వెలుగు సంఘమిత్రలు, డ్వాక్రా మహిళలు సంతాపం వ్యక్తం చేశారు.

ఇంటర్ ఫెయిలైన విద్యార్థి అదృశ్యం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 12: ఇంటర్ ఫెయిలయ్యానని మనస్తాపానికి గురైన విద్యార్థి అదృశ్యమయ్యాడు. శ్రీకాళహస్తి శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన రామ్‌నరేష్ కుమారుడు రమేష్(18) పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాశాడు. శుక్రవారం విడుదలైన ఫలితాల్లో రెండు సబ్జెక్టులు ఫెయిలయ్యాడు. దీంతో ఇంటినుంచి వెళ్లిపోయాడు. కుటుంబసభ్యులు ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రేపు షర్మిల బహిరంగ సభ



మాట్లాడుతున్న రాజేష్ నాయుడు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 12: ఈ నెల 14వ తేదీన శ్రీకాళహస్తిలో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల బహిరంగ సభ జరగనున్నట్లు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి పోతుగుంట రాజేష్ నాయుడు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఆయన నివాసం వద్ద విలేకరులతో మాట్లాడారు. బేరివారి మండపం కూడలి వద్ద బహిరంగ సభ జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని ప్రజలందరూ విచ్చేసి సభను విజయవంతం చేయాలని కోరారు.

నలుగురు వలంటీర్ల రాజీనామా

ఏర్పేడు, ఏప్రిల్ 12: ఏర్పేడు మండలంలోని మోదుగులపాళెం పంచాయతీకి చెందిన వలంటీర్లు సురేంద్ర, సంధ్య, అయ్యప్ప, మహేష్ శుక్రవారం రాజీనామా చేశారు. రాజీనామా లేఖను ఎంపీడీవో గీర్వాణికి అందజేశారు.

మామిడి తోట దగ్ధం

నాగలాపురం, ఏప్రిల్ 12: మండలంలోని గోళ్లవారి కండ్రిగకు చెందిన రైతు పీ.మునిరత్నం మామిడి తోటకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. టీపీపాళెం రెవెన్యూలో ఉన్న మామిడితోట తోటలో సుమారు 350 చెట్లు కాలిపోయాయి. శుక్రవారం నాగలాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కాంగ్రెస్ టికెట్ నాకే ఇవ్వాలి: బత్తెయ్య నాయుడు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 12: శ్రీకాళహస్తి కాంగ్రెస్ శాసనసభ టికెట్ తనకే ఇవ్వాలని పీసీసీ జనరల్ సెక్రటరీ డాక్టర్ బత్తెయ్యనాయుడు కోరారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వారం ముందు పార్టీలోకి వచ్చిన వారికి టికెట్ కేటాయించడం భావ్యం కాదన్నారు. నాయకులు శేఖర్, శివకుమార్, వెంకటమని పాల్గొన్నారు.

ఈవీఎం గోదాము తనిఖీ

రేణిగుంట, ఏప్రిల్ 12: విమానాశ్రయ మార్గంలోని ఈవీఎం గోదామును కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తనిఖీ చేశారు. స్ట్రాంగ్‌రూములకు తరలింపు కోసం చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించారు.

మాజీ ఎంపీపీని పరామర్శించిన ఆదిమూలం

పిచ్చాటూరు, ఏప్రిల్ 12: మండలంలోని తలపక్షపురం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ శైలారెడ్డి మేనమామ మంకయ్యరెడ్డి (85) శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందారు. ఎమ్మెల్యే ఆదిమూలం టీడీపీ నాయకులతో కలిసి వెళ్లి ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీపీ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ట్రాక్టర్‌ను పట్టుకున్న ఏర్పేడు పోలీసులు

ఏర్పేడు, ఏప్రిల్ 12: చోరీ గురైన ట్రాక్టర్ డోజర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఏర్పేడు కమ్మపల్లికి చెందిన గోల్లమునెన్నాయుడుకు చెందిన ట్రాక్టర్ డోజర్ రెండు రోజుల క్రితం చోరీకి గురైంది. ఈక్రమంలో పల్లంపేట వద్ద ఉండగా శుక్రవారం గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి జిల్లాలోని మొటూరు గ్రామానికి చెందిన రాజశేఖరన్‌ను అదుపులోకి తీసుకున్నారు. సీఐ శ్రీరామ శ్రీనివాసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేసుకోవాలి

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 12: గర్భిణులు ప్రతి నెలా తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు దివాకర్ తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం జరిగిన ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 80 మంది గర్భిణులకు డాక్టర్లు మాధవి, దివాకర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. మొదటి కాన్పు వారు ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకం కోసం దరఖాస్తు చేసుకుంటే కేంద్ర ప్రభుత్వం రూ.5వేలు బ్యాంకు ఖాతాలో వేస్తుందని వివరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 12: శ్రీకాళహస్తి పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ తిరుపతి రూరల్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వాసురెడ్డి తెలియజేశారు. నెలవారీ మరమ్మత్తు పనులు చేపట్టేందుకు విద్యుత్ ఉపకేంద్రాల్లో ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేయనునట్లు పేర్కొన్నారు. శ్రీకాళహస్తి పట్టణ, గ్రామీణ, బుచ్చినాయుడు కండ్రిగ, ఏర్పేడు, కేవీబీపురం మండలాల పరిధిలోని వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

వలంటీర్లకు గౌరవ వేతనం రెట్టింపు చేస్తాం



బొజ్జల సుధీర్ రెడ్డికి మంగళ హారతులు పడుతున్న మహిళలు, ప్రచారం చేస్తున్న టీడీపీ, బీజేపీ నాయకులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 12: వలంటీర్లకు గౌరవ వేతనం రెట్టింపు చేస్తామని టీడీపీ శ్రీకాళహస్తి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి తెలియజేశారు. శనివారం ఉదయం పట్టణంలోని వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలను మహిళలకు వివరించారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ దుర్మార్గుల బెదిరింపులకు నిస్వార్థంగా సేవలు అందించే వలంటీర్లు భయ పడాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు విజయ్‌కుమార్, కంఠా రమేష్, బీజేపీ నాయకులు కండ్రిగ ఉమ, అమర్నాథ్, జనసేన నాయకులు మహేష్ పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు

తొట్టంబేడు: వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు రోజురోజుకు పెరుగుతున్నాయని బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కాసరం, కొండరాజులపల్లి గ్రామాలలోని వైసీపీ సీనియర్ నాయకులు సంద్ర మహేష్ నాయుడు, గాలి ధనంజయులునాయుడు, రమేష్ నాయుడు, వలంటీర్ కుటుంబం సభ్యులు వెంకటరమణయ్య, సమ్మారువర్ధన్, ఆర్‌వార్డుమెంబర్ మెంబర్ కనుమూరి వెంకయ్యలు వారి అనుచరులతో టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు, మండల అధ్యక్షుడు గాలిమురళీనాయుడు, నాయకులు భాస్కర్‌నాయుడు, చంద్రారెడ్డి, రమాదేవి, రామపులయాదవ్, బాలయ్యనాయుడు, సుబ్రమణ్యం నాయుడు, హరినాయుడు, గణేష్‌నాయుడు పాల్గొన్నారు.

ఏర్పేడు: ఏర్పేడు మండలం ఎండీపుత్తూరు పంచాయతీ మిట్టకండ్రిగ ఇండ్లకు చెందిన అమ్ములమ్మ, గోవిందమ్మ, కన్నమ్మ తదితరులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికి శ్రీకాళహస్తి టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పేరం ధనంజయులునాయుడు, దొరస్వామియాదవ్, రామిరెడ్డి, సురేష్‌యాదవ్, నాగరాజునాయుడు, పొన్నారావు పాల్గొన్నారు.

- అలాగే సదాశివపురం గ్రామానికి చెందిన భక్తుడు రాజు, జనార్ధనరాజు, సురేంద్ర తదితరులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికి రిషితారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తులసి, మునెయ్య, బాబునాయుడు, ఇంద్రసేనారెడ్డి, ఆనందరాజు పాల్గొన్నారు.
- మాధవమాలలో బొజ్జల రిషితారెడ్డి ఎన్నికల ప్రచారం చేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని ఆదరించాలని సుధీర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పొన్నారావు, ధనంజయులునాయుడు, చిరంజీవినాయుడు, మోహన్‌రావు, సతీష్‌నాయుడు, నాగరాజునాయుడు, రవినాయుడు, జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన మిట్టకండ్రిగ మహిళలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న బొజ్జల రిషితారెడ్డి

'ఇసుక, మట్టి, మైన్స్ దోపిడీ నాకు చేతకాదు'



ప్రచారం చేస్తున్న కోనేటి ఆదిమూలం

కేవీబీపురం, ఏప్రిల్ 12: ఇసుక, మట్టి, మైన్స్ దోపిడీ తనకు చేతకాదని ఎమ్మెల్యే ఆదిమూలం పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరాచక పాలన తనకు చేతకాదన్నారు. పేదలకు సేవ చేయడమే తెలుసన్నారు. అలాంటి తనను వైసీపీ అవమానిస్తే చంద్రబాబు ఆదరించి టికెట్ ఇచ్చారని తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే వైసీపీని ఇంటికి సాగనంపి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవాలని తెలియజేశారు. అనంతరం కేవీబీపురం, పూడి గ్రామాల్లోని 47 మంది యువకులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికి ఆయన పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రామాంజులునాయుడు, తిరుపతి పార్లమెంటు రైతు విభాగం అధ్యక్షుడు గోపీనాథ్‌రెడ్డి, తిరుపతి టీఎన్ టీయూసీ అధ్యక్షుడు జయరామిరెడ్డి, జనసేన అధ్యక్షుడు దామస్, బీజేపీ మండలాధ్యక్షుడు మునిశేఖర్, జనసేన మునికృష్ణ, ఎమ్మార్పీఎస్ లోకేష్, నాయకులు లావణ్యకుమార్, సాదు, కిషోర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, పావని, రామచంద్రయ్య పాల్గొన్నారు.

వైసీపీ అనుకూల అధికారులపై చర్యలు తీసుకోండి

● రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారికి కృష్ణయాదవ్ ఫిర్యాదు



రేణిగుంట, ఏప్రిల్ 12: శ్రీకాళహస్తి, తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లో వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారి ముఖేష్‌కుమార్ మీనాకు తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు కృష్ణయాదవ్ ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఈసీ తన తిరుమల, తిరుపతి పర్యటన ముగించుకుని రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడ ఆయన్ను తెలుగు యువత నాయకులు కలిశారు. స్థానిక సంస్థల, ఎమ్మెల్సీ తిరుపతి ఉప ఎన్నికల్లో వైసీపీకి అనుకూలంగా వ్యవహరించిన అధికారులకు నేడు ఏవోలుగా ఎన్నికల బాధ్యతలు ఇచ్చారని ఒక్కొక్కరికి 100 బూత్‌లు కేటాయించడంతో వారిపై అనుమానం ఉందన్నారు. సీఐ, ఎస్ఐ స్థాయి అధికారులను మండలాలు మార్చి ఎన్నికల్లో లబ్ధిపొందేలా వైసీపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. వలంటీర్లతో రాజీనామా చేయించి ఏజెంట్లుగా కూర్చోబెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు.పారదర్శక ఎన్నికల కోసం నిజాయితీ గల అధికారులను నియమించాలని వినతిపత్రం అందజేశారు. జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్ ఈ విషయంపై చర్యలు తీసుకుంటారని ముఖేష్‌కుమార్ మీనా హామీ ఇచ్చారు.

అంగన్వాడీ కార్యకర్తకు వామపక్షాల పరామర్శ



తొట్టంబేడు, ఏప్రిల్ 12: వైసీపీ శ్రేణుల దాడిలో గాయపడిన అంగన్వాడీ కార్యకర్తను వామ పక్షాల నాయకులు పరామర్శించారు. శ్రీకాళహస్తి మండలం ఎంపేడు గ్రామంలోని ఈశ్వరయ్య కాలనీలో అంగన్వాడీ కార్యకర్త జేబీపాలెంపై వైసీపీ శ్రేణులు గురువారం దాడిచేసిన గాయ పరిచిన విషయం తెలిసిందే. గాయపడిన జేబీపాలెం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమెను సీపీఐ, సీపీఎం నాయకులు శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాడిచేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనమాల గురవయ్య, గంధం మణి, గోపి, గురవయ్య రాజు, గురునాథం, వెలిగొండ్రం పాల్గొన్నారు.

హైదరాబాదులో శిక్షణకు ఎంపిక



సంక్రాంతి రాజేంద్రుడు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 12: శ్రీకాళహస్తిలోని ఎస్సీవీ ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలకు చెందిన తెలుగు అధ్యాపకులు సంక్రాంతి రాజేంద్రుడు హైదరాబాదులో జరుగనున్న ప్రత్యేక శిక్షణకు ఎంపికయ్యారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నిర్వాహకులు సింగిల్ మేజర్ సబ్జెక్టు తెలుగు మాస్టర్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌కు రాష్ట్రవ్యాప్తంగా పలువురు అధ్యాపకులను ఎంపిక చేశారు. ఇందులో భాగంగా తిరుపతి జిల్లా నుంచి సంక్రాంతి రాజేంద్రుడు శిక్షణ తరగతులకు ఎంపికయ్యారు. శిక్షణ ముగిసిన తర్వాత ఆయన జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అధ్యాపకులకు శిక్షణ ఇవ్వనున్నారు. జిల్లా మొత్తానికి శ్రీకాళహస్తి నుంచి సంక్రాంతి రాజేంద్రుడు ఎంపిక కావడంపై ప్రిన్సిపాల్ శ్రీలత సహ అధ్యాపకులు శనివారం ఆయనకు అభినందనలు తెలిపారు.

యజమానికి తెలియకుండా భూమి విక్రయం..!



తమ ఎదుటే ఉన్న పట్టాలను చూపుతున్న బాధితులు, బంధువులు

రేణిగుంట, ఏప్రిల్ 12: భూమి యజమానికి తెలియకుండా ఆతడి భూమి రికార్డులు మార్చేశారు. అంతటితో ఆగకుండా ఆ భూమిని వేరే ఇద్దరి పేర్ల మీద రిజిస్ట్రేషన్ చేయించేశారు. ఆలస్యంగా గుర్తించిన యజమానులు న్యాయం కోసం పోరాడుతున్నారు. బాధితుల కథనం మేరకు.. రేణిగుంట మండలం చెంగారెడ్డిపల్లిలో కరకంబాడి లెక్క దాఖలా సర్వే నెంబరు 551/11-01, బిలో 1.10ఎకరాల భూమి ఉంది. ఇందులో 60 సెంట్లు కెలీలాకృష్ణ పేరుపై 50 సెంట్లు పద్మజ పేరుపై ఉంది. తండ్రి శంకరయ్య ద్వారా వీరికి సంక్రమించింది. స్థానికంగా ఉన్న వైసీపీ నాయకుడికి రెవెన్యూ అధికారుల సాయంతో లీలాకృష్ణ పేరుతో ఉన్న భూమిని సిద్దయ్య అనే వ్యక్తి పేరుపై మార్పించారు. తర్వాత ఆతడి ద్వారా అదిలాలకు చెందిన ఆవుల శ్రీనివాసులుకు విక్రయించారు. విషయం తెలుసుకున్న బాధితులు న్యాయం కోసం శుక్రవారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. తన సోదరిపేరుతో ఉన్న భూమిని సైతం కాజేయాలని చూస్తు న్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామని ఎన్నికల తర్వాత పరిశీలిస్తామని చెప్పారని పేర్కొన్నారు. ఈ విషయమై ఇప్పటికే కోర్టు ద్వారా లీగల్ నోటీసులు కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్డీవో, స్థానిక తహసీల్దారుకు పంపామన్నారు. జిల్లా అధికారులు స్పందించి న్యాయం చేయాలని వేడుకున్నారు.

ముక్కంటి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు



ప్రసాదాలు అందుకుంటున్న సుప్రీమ్ జస్టిస్ సి.టీ. రవికుమార్

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 12: ముక్కంటి ఆలయాన్ని శనివారం ఇద్దరు సుప్రీంకోర్టు న్యాయ మూర్తులు వేర్వేరుగా దర్శించుకున్నారు. ముందుగా జస్టిస్ సీటీరవికుమార్ కుటుంబ సమేతంగా విచ్చేశారు. అలాగే జస్టిస్ సంజయ్ కరోల్ విచ్చేశారు. అధికారులు దక్షిణ గోపురం వద్ద వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. సహస్ర లింగం వద్ద రూ.5000 రాహుకేతు సర్ప దోష నివారణ పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకు న్నారు. గురు దక్షిణామూర్తి సన్నిధి వద్ద పండితులు వేదపఠనంతో సత్కరించి వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. స్థానిక 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత అద్దె గదులపై ఏడీవో విచారణ

వరదయ్యపాళెం, ఏప్రిల్ 12: వరదయ్యపాళెంలోని బాల వినాయక చేనేత వస్త్ర ఉత్పత్తి, విక్రయ సహకార సంఘం భవనంలో అద్దె గదుల విషయంలో తలెత్తిన వివాదంపై శుక్రవారం చేనేత జౌళి శాఖ ఏడీవో, బాల వినాయక చేనేత భవనం ఇన్‌ఛార్జి కిరణ్‌కుమార్ విచారణ చేపట్టారు. అద్దెకు ఉన్న వారిని, సంఘం పెద్దలను పిలిపించారు. మే నెల నుంచి సంఘం ఖాతాల్లో నగదు జమచేయాలని దుకాణదారులకు సూచించారు. చేనేత సంఘం నాయకులు ఇంతకాలం అనధికారికంగా సేకరించిన సొమ్ము ఎలా వెళ్లిందని, ఖాతాలో ఎందుకు వేయలేదనే విషయాలను నివేదిక రూపంలో జిల్లా చేనేత జౌళిశాఖ సహాయ సంచాలకులకు నివేదిస్తామన్నారు.

రశీదు కూడా ఇవ్వలేదు..

మా దగ్గర రూ.25లక్షలు అడ్వాన్సు తీసుకుని కనీసం రశీదులు ఇవ్వలేదని ఆ భవనంలో స్వీట్ దుకాణం నిర్వహిస్తున్న చెంగయ్య విచారం వ్యక్తం చేశారు.

సత్యవేడు జూనియర్, గురుకుల కళాశాలల్లో వందశాతం ఉత్తీర్ణత



డి.లావణ్య, వినోలియా, మమత, మునిశ్రీ, దిలీప్‌కుమార్, రేష్మ

సత్యవేడు, ఏప్రిల్ 12: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో సత్యవేడు ప్రభుత్వ జూనియర్ కళాశాల, అంబేద్కర్ బాలికల గురుకుల కళాశాల విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించి సత్తాచాటారు. శుక్రవారం విడుదలైన ఇంటర్ పరీక్ష ఫలితాల్లో సత్యవేడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరంలో 73 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 73 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 88 మందికి 88 మంది ఉత్తీర్ణులయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ జగన్నాథంనాయుడు తెలిపారు. ఇందులో ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విద్యార్థిని మునిశ్రీ 1000 మార్కులకుగాను (939) మార్కులు, దిలీప్‌కుమార్ (920), బైపీసీలో వినోలియా(949) మార్కులు, పురుషోత్తం(900) మార్కులు సాధించారు. సీఈసీలో బాలసుబ్రహ్మణ్యం(772), గోపిక(769), హెచ్ఈసీలో గిరి(665), ప్రదీప్(648) మార్కులు సాధించారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో 460 మార్కులకు గాను లక్ష్మీ ప్రసాద్(458), తనుష్(446), బైపీసీలో 440 మార్కులకు గాను హరిప్రియ(375), షష్మరిణి(359) మార్కులు సాధించారు. సీఈసీలో 500 మార్కులకు గాను తులసిప్రియ(390), లోకేష్(384), హెచ్ఈసీలో మనిగండన్(398), విశాల్(379) మార్కులు సాధించారు.

గురుకుల కళాశాల విద్యార్థినుల సత్తా..

డాక్టర్ అంబేద్కర్ బాలికల గురుకుల కళాశాలలో మొదటి సంవత్సరం పరీక్షకు 72 మంది విద్యార్థినులు హాజరు కాగా 72 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 75 మందికి గాను అందరూ ఉత్తీర్ణులయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ ప్రసూన తెలిపారు. ద్వితీయ సంవత్సరం బైపీసీలో డి.లావణ్య(986), మమత(928), జోష్న(915), ఎంపీసీలో రేష్మ(948), వైష్ణవి(917), హేమలత(891) మార్కులు సాధించారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో రోజా(463), త్రిష(461), మానస(459), బైపీసీలో గిరిజ(427) మార్కులతో మొదటి స్థానంలో, హర్షిత(426) మార్కులతో రెండో స్థానంలో, భువన భాషిత(421) మార్కులు సాధించారు.